# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

బుధవారం, మార్చి 25, 2026 | సంపుటి - 20 | సంచిక 193 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## నగరంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు



- బంకుల వద్ద బారులు తీరవద్దు
- సోషల్ మీడియా పుకార్లు నమ్మొద్దు: కమిషనర్

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. నగరంలో ఇంధన నిల్వలు నిండుకున్నాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

తరువాయి 2లో

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్



- మోడీ, అమిత్ షా, జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీలకు బాంబు బెదిరింపులు
- అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ

2

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

## భద్రాద్రిలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

27న కళ్యాణం, 28న పట్టాభిషేక మహోత్సవాలు

భద్రాచలం : భద్రగిరిలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి.

తరువాయి 2లో



## మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు

క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు



- హిందువుల, సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై

2లో



2లో

## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి
- తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు

## జిహెచ్ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు



రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు

మేడ్చల్ అభివృద్ధి పై దృష్టి పెట్టాలన్న మల్లారెడ్డి

అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ : బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబంధించి.. సిఎం రేవత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీలోలో సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా శ్రీధర్ బాబు మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించిన విషయంపై మాట్లాడారు. జిహెచ్ఎంసి అభివృద్ధికి రూ. 15 వేల కోట్లు నిధులు మంజూరు చేశామని, రూ. 122 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎమ్మెల్యేలు చెప్పారని తెలియజేశారు.

2లో

## త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

- కొనుగోలుదారు అఫ్పిడవిట్ ఇస్తే సరిపోతుంది
- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
- శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్ : రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైంనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు.

2లో

## క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

- వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి
- ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది
- నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

2

## ఈవీ వాహనాలపై 20శాతం డిస్కౌంట్

- పెద్ద ఎత్తున ఇవి ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహింద్రా తదితర కంపెనీలు
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా

2లో



## మిట్టల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు వరం

- ఇక్కడి పారిశ్రామిక అభివృద్ధిలో కీలకం
- కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు

న్యూఢిల్లీ : అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఏపీ పారిశ్రామిక రంగంలో చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యానించారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర తలరాతను మార్చనున్న మెగా స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఇదని పేర్కొన్నారు.

తరువాయి 2లో

## అమరావతిలో మరోమారు అగ్నిప్రమాదం



- వరుస ప్రమాదాలపై చంద్రబాబు అనుమానం
- దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని ఆదేశం

అమరావతి : రాజధాని అమరావతిలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి రాయపూడి సమీపంలో ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల వద్ద నిర్మాణ ప్రాంగణంలో చోటు చేసుకుంది. కాంట్రాక్టు సంస్థ మేఘా కంపెనీకి చెందిన ప్లాస్టిక్ పైపుల వద్ద అకస్మాత్తుగా నిప్పులు చెలరేగాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా అమరావతిలో ఇటీవల కూడా భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ నెల 11న ఎల్ అండ్ టీకి చెందిన ప్లాస్టిక్ పైపులు

తరువాయి 2లో

## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ



మండిపడ్డ విపక్ష నేత రాహుల్

న్యూఢిల్లీ : పశ్చిమాసియా ఉద్రిక్తతలను గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ పరిస్థితి కోవిడ్ తరహాలా ఉందంటూ పేర్కొనడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచి పోయారా? అని ప్రశ్నించారు.



## పునర్విభజనతో మరిన్ని అవకాశాలు

- పునర్విభజనపై వాస్తవిక దృక్పథంతో ముందుకు వెళ్దాం
- గెలుపే లక్ష్యంగా స్థానిక పోరుకు సిద్ధమవ్వండి
- నిలబడిన ప్రతి చోటా జనసేన జెండా ఎగిరేలా కష్టపడండి
- నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి
- వారంలో ఒకరోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం తప్పనిసరి
- పార్టీ బలంగా ఉంటేనే ప్రజాప్రతినిధులు బలంగా ఉంటారు
- పార్టీ నేతలకు జనసేనాని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం

విజయవాడ : నియోజకవర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజక వర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.

తరువాయి 11లో

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు.వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## నగరంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

నగరవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల దగ్గర సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా ఎక్కడా ఆగిపోలేదని సీపీ తెలిపారు. కొరత ఉందన్న ఆందోళనతో పెట్రోల్ బంకేల వద్ద భారీగా క్యూ కట్టవద్దని, అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, రవాణా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సీపీ హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. నగరంలో సాధారణ పరిస్థితులు కొనసాగేందుకు ప్రజలందరూ సహకరించాలని సీపీ కోరారు. రద్దీ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బంక్‌ల వద్ద బారులు తీరవద్దని సూచించారు. సోషల్ మీడియా పుకార్లు నమ్మవద్దన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

న్యూఢిల్లీ : దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

## త్వరలో ‘సాదాబైనామా’ పరిష్కారం

భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లాలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. ధరణి పోర్టల్ లోని లోసుగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసూదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్ల కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేసి కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

హైదరాబాద్ : దాదాపు అరుస్సర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో ఎన్నో వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నాయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులను కోరుకున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేడెక్కడికి నా అసెంబ్లీలో పోలీసులు రానీయడం లేదు.. మా లెజిస్లేచర్ పార్టీ ఆఫీస్ లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇవ్వకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని ఈ బడ్జెట్ సెషన్లో అడుగుతాం... నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నారు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బడ్జెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతి డాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టబోమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

జగిత్యాల : తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. ‘జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.‘ అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

## జిహెచ్ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

2016 లో ఎస్ఆర్ డిపిని తీసుకువచ్చారని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జవహర్ నగర్ ప్రాంతం తన గుండెకాయ అని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ చెత్త అంత అక్కడే వేస్తున్నారని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన ప్రస్తావించారు. ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు అంటే తనకు చాలా అభిమానం అని తెలియజేశారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హయాంలో ఏర్పాటు చేశారని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. జవహర్ నగర్ చెత్తతో రెండున్నర లక్షల మంది అవస్థలు పడుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచానా అని అనిపిస్తుందని, తనపై కుట్ర పన్నుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. మేడ్చల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మోరీలు, కరెంటు స్తంభాలు లేవు. జవహర్‌నగర్‌లో చెత్త కొండ పేరుకుపోతోంది. వాతావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధరన్నా మీకు దండం పెడతా. మాపై పగపట్టకండి. దయచేసి మేడ్చల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించండి‘ అని మల్లారెడ్డి కోరారు. అలాగే గత పదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీలు లేవని వ్యాఖ్యానించారు. దీనిపై శ్రీధర్ బాబు స్పందించారు. నిజాలు చెప్పినందుకు మల్లారెడ్డిని అభినందించారు. గత పదేళ్లగా అభివృద్ధి జరగలేదని తాము అంటున్నామని అన్నారు. ఇదిలావుంటే రేవంత్ రెడ్డిని సీఎంని చేసింది తానేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ తప్ప మరెవరూ పవర్‌ఫుల్ నాయకుడు లేరని రెడ్డి సంఘం సమావేశంలో తానే చెప్పానని గుర్తుచేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. ఎవరు అవునన్నా, కాదన్నా తాను, రేవంత్ అన్నదమ్ములమేనని చెప్పారు.

## భద్రాద్రిలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

గవర్నర్, సిఎంలకు కూడా ఇప్పటికే ఆహ్వానాలు అందచేశారు. 27న జరిగే సీతారాముల కల్యాణం, 28న జరిగే మహా పట్టాభిషేకం కార్యక్రమాలను ఎలాంటి లోటుపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పూర్తిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆమె హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వంహించారు. ఈ వీసీకి భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన కార్యాచరణతో పని చేయాలన్నారు. ఇక నవమి రోజున 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి రానున్నారని, అదేరోజు ఆయన చేతుల మీదుగా ఆలయాభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం ఉంటుందని.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు శిలాఫలం ఏర్పాటు పనులు పూర్తి చేయాలన్నారు. ఇక పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ , తదిత భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. మిథిలా స్టేడియంలో ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు, వీఐపీలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శిఇప3.తూణభద్రాచలంలో మిథిలా స్టేడియంలో జరుగుతున్న శ్రీరామనవమి ఏర్పాట్లను కలెక్టర్ అంకిత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. 26న ఉదయం 9గంటల వరకు సబ్‌కలెక్టరు కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వీవీఐపీ, వీఐపీలకు బస చేసే అతిథి గృహాలకు నియమితులైన సెక్టారల్ అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, అనారోగ్యంతో ఉన్న వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఐపీల వెంట వచ్చే సిబ్బంది ఎవరైనా గొడవలకు దిగితే పోలీసు సహకారం తీసుకొని సర్దుబాటు చేయాలని, దేవుడి దగ్గర అందరూ సమానమే అన్నారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఆర్‌డీవో విద్యాచందన, తదితరులు పాల్గొన్నారు.

## మిట్టల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు వరం

దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా ఏపీ ప్రాజెక్ట్ రికార్డు సృష్టించనుందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లక్షలాదిమందికి పైగా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఏటా 17 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగనుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషితో ఈ భారీ ప్రాజెక్ట్ సాకారమైందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్ ఇంజిన్‌గా మారనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## జిహెచ్ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక్ర వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సమీక్షా సమావేశం లో ప్రభుత్వం ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు , హైర్ లేదా డిపా÷-టం÷-మెంట్ లు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలెక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి..క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ర బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిట్రైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్ ,ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాపేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం.. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.

## అమరావతిలో మరోమారు అగ్నిప్రమాదం

తగలబడటంతో కోట్లాది రూపాయల నష్టం జరిగింది. రాజధాని అమరావతిలోని ప్రాంతం రాయపూడిలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో మంగళవారం సమీక్ష చేశారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద మెగా సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు రాత్రి దగ్ధమైన ఘటనపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో తరుచూ అగ్రిప్రమాదాలు జరగడంపై సీఎం అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాదమా, కుట్రకోణం ఉందా అనే విషయంలో సమగ్ర విచారణ జరపాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మూడు ఘటనల్లో వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన నిర్మాణ సామాగ్రి దగ్ధమైందని తెలిపారు. రాజధాని అమరావతిలోని రాయపూడి వద్ద నూతనంగా నిర్మిస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారుల టవర్ల సమీపంలో పైపులు కాలిపోయాయి. ఇది ప్రమాదమా..?, కుట్రకోణమా అనే దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల వెలగపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కొందరు ఉద్దేశపూర్వకంగా పైపులకు నిప్పు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అలాగే మెగా సంస్థకు చెందిన పైపులకు కొందరు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

## క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

హైదరాబాద్ : క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కేం÷-దర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి న ఇవారణకు అనేక చర్యలు తీసుకుంటున్నా..మళ్లీ ఇది విజృంభించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందని అన్నారు. అంతర్జాతీయ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి మాట్లాడారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. లేకుంటే ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాప్తి చెంది సమాజానికి సవాల్ చేయగలదన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో యువ పల్మనాలజిస్టులు చేపట్టిన చైతన్య కార్యక్రమాన్ని మంత్రి అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలా చైతన్యం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో సామాజిక బాధ్యతగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. అంకిత్ కోట్ల, డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంత్ ,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ మంగళవారం కెబిఆర్ పార్క్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని, డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు.

## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

పార్లమెంటు వెలుపల మీడియాతో రాహుల్ మంగళవారంనాడు మాట్లాడారు. ’పార్లమెంటులో ఆయన నిన్న సందర్భోచితం కాని మాటలు మాట్లాడారు. కరోనా మహమ్మారితో ప్రస్తుత సందర్భాన్ని పోల్చారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో ఇప్పుడే పెరుగుదల మొదలైంది. ఇంతలోనే పరిస్థితిని కరోనా మహమ్మారి రోజులతో ఆయన పోలుస్తున్నారు. కరోనా విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయినట్టున్నారు’ అని రాహుల్ అన్నారు. దేశ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, దేశ విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని, అంతర్జాతీయంగా ఇదొక హాస్యాస్పద అంశంగా మారిందని అన్నారు. ’మోదీ రాజీపడితే మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్టే కనిపిస్తోంది’ అని వ్యాఖ్యానించారు. మధ్యఆసియాలో పరిణామాలపై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశంపై అడిగినప్పుడు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినా సరిదిద్దుకోలేని నిర్మాణాత్మక తప్పిదం జరిగిందని అన్నారు.

# 4473 ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విడుదల

### హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ గౌతం

హైదరాబాద్,మార్చి24 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల విడుదలకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా 4473 మంది కి రూ.48.79 కోట్లను విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం తెలిపారు. ప్రతివారం ఇండ్ల నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. గత వారానికి సంబంధించి రూఫ్ లెవల్ వరకు నిర్మాణాలు పూర్తి చేసిన 1969 మంది లబ్ధిదారులకు రూ.17.23 కోట్లు, స్లాబు పూర్తి చేసిన 2504 మందికి రూ.31.56 కోట్లు విడుదల చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లక్ష ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని ఆ దిశలో ఫలితాలు సాధిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇంతవరకు లబ్ధిదారులకు రూ.5376.22 కోట్లను విడుదల చేసినట్లు ఎండి శ్రీ గౌతం వివరించారు. ఇంటి నిర్మాణపు పురోగతిని బట్టి విడతల వారీగా లబ్ధిదారులకు రూ.5 లక్షలను అంద చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంతవరకు బేస్ మెంట్ నిర్మాణం పూర్తి అయిన వాటికి రూ. 2125.98 కోట్లు, గోడలు పూర్తి అయి రూఫ్ లెవల్ వరకు వచ్చిన ఇండ్లకు రూ.1518.51 కోట్లు, స్లాబ్ పూర్తి అయిన వాటికి రూ.1731.73 కోట్లు విడుదల చేశామని ఆయన తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 2.65 లక్షల ఇండ్ల పనులు ప్రారంభంగా కాగా, వాటిలో ఇంతవరకు 1,13,365 ఇండ్ల స్లాబు పూర్తి అయ్యిందని, 34,552 ఇండ్లు రూఫ్ లెవల్ (గోడల నిర్మాణం పూర్తి) దశలో ఉన్నాయని, మరో 61 వేల ఇండ్ల బేస్ మెంట్ నిర్మాణాలు పూర్తి అయ్యాయని ఆయన వివరించారు.

# ప్రజల దృష్టి మరల్చేందుకే ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు

### ఫార్ములా రేస్‌లో న్యాయస్థానంలో పోరాడుతాం

### అందాల పోటీలతో సాధించిందేమిటో చెప్పాలి: కెటిఆర్

హైదరాబాద్,మార్చి24 : ప్రజల దృష్టి మరల్చేందుకే ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేశారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఎవరికి అనుచిత లబ్ది చేకూర్చామని ఆరోపిస్తున్నారో.. వారి పేరే లేదని చెప్పారు. ఈ కేసులో న్యాయపోరాటం చేస్తామని.. న్యాయస్థానాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. రూ.200 కోట్లతో నిర్వహించిన మిస్‌వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? అని ప్రశ్నించారు. ఎన్ని చేసినా ఆరు గ్యారంటీలు అమలు చేసేవరకు పోరాడతామన్నారు. 'ఈ కేసులో ఏమీ లేదని ఛార్జిషీట్‌లో ప్రభుత్వం మళ్లీ అంగీకరించింది. మేం కట్టింది రూ.45 కోట్లయితే.. రూ.500 కోట్లు, రూ.600 కోట్లు అని చెబుతున్నారు. విధానపరమైన లోపం ఉన్నట్లుందని ఛార్జిషీట్ ద్వారా తెలుస్తోంది. తప్పు జరిగితే.. బ్యాంకు ఖాతాలోని డబ్బును ఎందుకు రికవరీ చేయలేదు? ఈ కేసులో ఏమీ లేదని నేను మొదట్నుంచీ చెబుతున్న విషయాన్ని ప్రభుత్వం ధ్రువీకరించింది. ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో హైదరాబాద్‌ను ప్రపంచపటంలో పెట్టేందుకు చేసిన ప్రయత్నమే ఫార్ములా ఈ-కార్ రేస్' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# అంబేడ్కర్ ఓవర్సీస్ పథకంతో 2వేల మందికి లబ్ది

### అసెంబ్లీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి

హైదరాబాద్,మార్చి24 : విదేశీ విద్య ఉపకార వేతనాల పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా సుమారు 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు చెల్లించామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. దీనికోసం ఇప్పటి వరకు రూ.607 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. విదేశాల్లో చదువుకునే వారికి ఈ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని చెప్పారు. అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ 2025 అక్టోబర్‌లో విదేశీ విద్య ఉపకార వేతనాలు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. విదేశాలకు వెళ్లిన విద్యార్థులు దీనికోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అక్కడ ఫీజులు కట్టలేక.. ఇక్కడికి రాలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని అమలు చేయాలని కోరారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విదేశీ విద్య ఉపకార వేతనాలు ఎస్సీ వర్గాలకే మేలు చేస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ఎ÷-లాన్‌ను వంద శాతం అమలు చేయాలని.. దీంతో ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని.. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయడం లేదన్నారు. మాల, మాదిగలకు వేర్వేరు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు దానికి సంబంధించిన విధి విధానాలు రూపొందించలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

హైదరాబాద్,మార్చి24 : హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో వర్షం పడింది. పలు చోట్ల రహదారులపై భారీగా వరద చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి వంతెనపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మణికొండలో వడగళ్ల వాన కురిసింది. యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణనగర్‌లో రహదారులను వాన నీరు ముంచెత్తింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వాన నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

### అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన

హైదరాబాద్ : రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. అవే ప్లకార్డులతో అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. గ్యాస్ కొరత లేదని చెబుతూనే హోటళ్లు, చిరు వ్యాపారులకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంపై బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు చిరు వ్యాపారులు, హోటల్ వ్యాపారంపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సరఫరా సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద చాంతాడంత లైన్లు కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నమ్మబలుకు తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో




ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఆధీనంలో పెట్రోలియం శాఖ ఉందని.. తామేమీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని కేటీఆర్ అన్నారు. ఫ్యూచర్‌లో గ్యాస్ సిలిండర్ల సైజ్ తగ్గిస్తారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంబోతుల కొట్లాటలో లేగలు బలైనట్లుగా సామాన్యుల పరిస్థితి ఉందని అన్నారు. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. కొరత లేదని కేంద్రం, సప్లయి లేదని రాష్ట్రం ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# కారుణ్యమరణంతో హరీష్ రాణా మృతి

### సుప్రీం అనుమతితో చికిత్స నిలిపివేత

న్యూఢిల్లీ,మార్చి24 : సుప్రీం కోర్టు ద్వారా కారుణ్య మరణానికి అనుమతి పొందిన హరీశ్ రాణా మృతిచెందాడు. సుమారు 13 ఏళ్లపాటు కోమాలో ఉండి జీవచ్ఛవంలా మారిన 32 ఏళ్ల హరీశ్ రాణా కారుణ్య మరణానికి సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల అనుమతిచ్చిన విషయం తెలిసిందే. అతడికి చికిత్స నిలిపివేయొచ్చని న్యాయస్థానం పేర్కొంది. దీంతో ఎయిమ్స్ వైద్యులు అతడికి క్రమంగా చికిత్స నిలిపివేశారు. ఈ క్రమంలోనే అతడు మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. 13 ఏళ్లుగా కోమాలో ఉండి, జీవచ్ఛవంలా మంచానికే పరిమితమైన 32 ఏళ్ల హరీశ్ రాణాకు కారుణ్య మరణానికి(పాసివ్ యూతనేషియా) అనుమతిస్తూ సుప్రీంకోర్టు మార్చి 11న చారిత్రాత్మక తీర్పునిచ్చిన సంగతి విదితమే. న్యాయస్థానం ఆదేశాల మేరకు వైద్యం నిలివేసిన వైద్యులు.. క్రమంగా అతడి ఆరోగ్యం క్షీణింపజేసి, మరణించేలా చేశారు. ఈ విషయమై హరీశ్ రాణా తండ్రి అశోక్ రాణా స్పందిస్తూ.. 'మేం దీనికోసమే పోరాడుతున్నాం. ఏ తల్లిదండ్రులు తమ కొడుకుకు ఈ రకంగా జరగాలని కోరుకోరు' అని కన్నీటిపర్యంతమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన 32 ఏళ్ల హరీశ్ రాణా చండీగఢ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతుండేవాడు. అతడు 2013 ఆగస్టు 20న హాస్టల్లో ప్రమాదవశాత్తూ నాలుగో అంతస్తు బాల్కనీ నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. శరీరం కదల్లేని స్థితికి చేరుకుంది. ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా అతడి హెల్త్ కండీషన్‌లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రమాదానికి గురైన నాటి నుంచీ కోమాలోనే ఉండిపోయాడు. ఈ నేపథ్యంలో హరీశ్ తల్లిదండ్రులు 2024 జులైలో కుమారుడి కారుణ్య మరణానికి అనుమతించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పలు కారణాలతో ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లారు హరీశ్ తల్లిదండ్రులు. వైద్య నివేదికలు పరిశీలించిన సుప్రీం ధర్మాసనం.. ఈ ఏడాది జనవరి 13న హరీశ్ తల్లిదండ్రులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంది. మానవీయ కోణంలో మర్యాదపూర్వక మరణాన్ని ప్రసాదించాలని వారు కోర్టును వేడుకున్నారు. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ కేసు విచారణలో సర్వోన్నత న్యాయస్థానం మార్చి 11న సంచలన తీర్పు వెలువరించింది. 13 ఏళ్లుగా జీవచ్ఛవంలా ఉన్న హరీశ్ రాణాకు పాసివ్ యూతనేషియాకు అనుమతించగా.. 2018లో చట్టబద్ధత అనంతరం దేశంలో పరోక్ష కారుణ్య మరణం జరిగిన తొలి కేసుగా నిలిచిన సంగతి తెలిసిందే.

# అసెంబ్లీ ముట్టడికి బిఆర్ఎస్ విద్యార్థుల యత్నం

### అడ్డుకున్న పోలీసులు.. పలువురి అరెస్ట

### ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్,మార్చి24 : అసెంబ్లీ ఎదుట ఉద్రిక్తత నెలకొంది. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ నాయకులు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తం అయిన పోలీసులు బీఆర్ఎస్వీ కార్యకర్తలను అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, వాహనాల్లో నాంపల్లి, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యారంగంపై సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు ధోరణికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ నాయకులు ఇవాళ అసెంబ్లీని ముట్టడించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. విద్యారంగం పై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గోస పుచ్చుకుంటుందని కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విడతల వారీగా బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీ ముట్టడికి వస్తుండటంతో వారిని అడ్డుకోవడానికి పోలీసులు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో క్షుణ్నంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ఇవాళ బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీని ముట్టడించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ.. ఉద్యమాలను అణిచివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. ఇది రాజ్యాంగ హక్కులను హరించడమే అని స్పష్టం చేశారు. ఇవాళ రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. గురుకులాలను పట్టించుకోవడం లేదని.. ప్రభుత్వ బడులను గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలన్న సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని వారు విమర్శించారు. నిరుద్యోగుల, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. విద్యారంగంపై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గోస పుచ్చుకుంటుందని కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

### కోవిడ్ తరహా సంక్షోభం

### నేడు అఖిలపక్షంతో ప్రభుత్వం భేటీ?

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయం తెలిసిందే. సోమవారం లోక్‌సభలో, ఇవాళ రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. ఇరాన్ సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు లోక్‌సభలో మోదీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబోయే రోజులకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడు పరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

# నేటి డిజిటల్ యుగంలోనూ వార్తల ప్రసారంలో ఆకాశవాణి పాత్ర సుస్థిరం

### ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్

హైదరాబాద్,మార్చి24 : వేగంగా మార్పు చెందుతున్న డిజిటల్ యుగంలోను ఆకాశవాణి వార్తలు తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించు కున్నాయని, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్, శ్రీ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రత్యేకత చాటుకుంటుం దని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని కవాడీ గూడ సిజిఓ టవర్స్ కాన్ఫరెన్స్ హాల్లో పార్ట్‌టైమ్ కరస్పాండెంట్స్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్స్, న్యూస్ రీడర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ ఓ÷ూ మహేష్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారి వృత్తి మెళకువలను పెంపొంది స్తుందని అన్నారు. సోషల్ మీడియా ఒత్తిడితో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా, విశ్వసనీయతను పోగొట్టుకోకుండా, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. తాము సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కరస్పాండెంట్లపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల వార్తలకు నిర్వచనమే మారిపోయిందనీ పేర్కొన్నారు. గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌గా ఆకాశవాణిలో ఖచ్చితత్వం, ధర్మనిష్టను పాటించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ, వాట్సప్ యూనివర్సిటీ ద్వారా వ్యాప్తి చెందుతున్న ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఖఎః లో ప్రారంభించిన ఫ్యాక్ట్ చెక్ విభాగం గురించి వివరించారు . ప్రభుత్వ కమ్యూనికేటర్లుగా విలేకరులు క్షేత్రస్థాయి అభివృద్ధి నివేదికలపై దృష్టి సారించాలని సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ మాట్లాడుతూ, ఆకాశవాణి విశ్వసనీయతకు, సమగ్రతకు, సంపూర్ణతకు మారుపేరు అని చెప్పారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని విశ్వసనీయతను పోగొట్టుకోకుండా ఆకాశవాణి ప్రఖ్యాతిని అలాగే నిలబెట్టాలని కరస్పాండెంట్లకు సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ.. 1957 ఫిబ్రవరి 7న ఆకాశవాణి లో వార్తా విభాగం ప్రారంభమైందని గుర్తు చేశారు. 1965లో ఉర్దూ శ్రోతలను దృష్టిలో ఉంచుకుని ఉర్దూ బులెటిన్ ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. పలు అంశాలపై సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖులు శిక్షణా తరగతులు నిర్వహించారు. 'మారుతున్న మీడియా వాతావరణంలో వార్తల సేకరణ, కంటెంట్ తయారీ' అనే అంశంపై ఆర్టీఐ మాజీ కమిషనర్, పీపుల్స్ పల్స్ డైరెక్టర్ ఆర్. దిలీప్ రెడ్డి అవగాహన కల్పించారు. 'సోషల్ మీడియా యుగంలో కంటెంట్ వినియోగం' అనే అంశంపై హిందూ బిజినెస్ లైన్ అసోసియట్ ఎడిటర్ ఆస. కూర్మనాథ్ వివరించారు. 'న్యూస్ రూమ్ పరిణామం, కంటెంట్ బదిలీ, మారుతున్న కంటెంట్ మూలాల స్వభావం' అనే అంశంపై ఐ న్యూస్ సీఈఓ, చీఫ్ ఎడిటర్ ఏ కే సాగర్ విశ్లేషించారు. అలాగే, 'ఫాక్ట్ చెక్, సోషల్ మీడియా హ్యాండిల్స్ మెరుగుపరచడానికి సోషల్ మీడియా టెక్నిక్స్' అనే అంశంపై ఫాక్ట్ లీ సంస్థ ఆపరేషన్స్ హెడ్ భరత్ వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా మారుతున్న మీడియా పరిస్థితులలో ఆకాశవాణి విలేకరులకు కొత్త దిశానిర్దేశర లభించింది.

# రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

### అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు

### ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచారపౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో-చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదన లను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచారపౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

### గతంలోనే హైకమాండ్ హామీ ఇచ్చింది

### మరోమారు మంత్రి పదవిపై పెదవి విప్పిన రాజగోపాల్

హైదరాబాద్,మార్చి24 : కాంగ్రెస్ హైకమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హామీ ఇచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు. తనకు పదవి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు గతంలో హామీనిచ్చిన అధిష్టానం ఇపుడు ఏం చేస్తుందో తెలియదన్నారు. నేను మంత్రి పదవి కోసం పాకులాడడం లేదు. ఏ పదవి లేకున్నా రాజగోపాల్ రెడ్డికి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందన్నారు. నాకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమన్నారు. తనకు రేవంత్ రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని.. నిన్న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ లేదు, ఎదురుపడితే పలకరించుకున్నామని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ కేటీఆర్‌తో కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానన్నారు.మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో కూడా హామీ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. హై కమాండ్ ఇప్పుడు ఏం చేస్తుందో తెలియదని చెప్పుకొచ్చారు. తాను మంత్రి పదవి కోసం పాకులాడటం లేదని పేర్కొన్నారు. ఏ పదవి లేకున్నా తనకి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తన లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని తెలిపారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని క్లారిటీ ఇచ్చారు. నిన్న సీఎంతో ప్రత్యేకంగా ఏం భేటీ లేదని, ఎదురుపడితే పలకరించుకున్నామని చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఇవాళ కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానని వివరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**సుల్తానాబాద్, మార్చి 24(ది క్రైమ్ న్యూస్):** న్యాయవాదుల రక్షణ కోసం ఏర్పాటుచేసిన న్యాయవాదుల రక్షణ బిల్లు ను తెలంగాణ ప్రభుత్వ మంత్రి వర్గం ఆమోదించి అసెంబ్లీ లో బిల్ పాస్ చేయడం పట్ల సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు స్థానిక కోర్టు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ గతంలో హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు నాగమణి వామన్ రావు లను అతి దారుణంగా హత్య చేయడం, ఇతర న్యాయవాదులపై దాడులు చేసి హత్య చేయడం వంటి సంఘటనలతో న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై ఇటీవల పలు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకొని న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును మంత్రి మండలి ఆమోదించడం అసెంబ్లీ లో బిల్లు పాస్ చేయడం శుభ పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గ సహచరులకు సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, ఏజీపీ దూడం ఆంజనేయులు, న్యాయవాదులు ఆవుల లక్ష్మి రాజం, ఆలూరి శ్రీనివాసరావు, భూసారపు బాలకిషన్ ప్రసాద్, పడాల శ్రీరాములు, వోడ్నాల రవీందర్, అవునూరి సత్యనారాయణ, జోగుల రమేష్, కోడం అజయ్, పెగడ శ్యామ్ సుందర్, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, చీకటి సంతోష్ కుమార్, అంబాల రాజు, వడ్లకొండ రవికిరణ్, మాదూరి పృథ్వీ, బొబ్బిలి శ్యాం, వేముల స్నేహ, రుద్రారపు శ్యాం సుందర్ , మందల రమేష్, అడ్వకేట్ క్లర్క్ లు అశోక్, గండి శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం స్టోర్ (నిల్వ) చేసేందుకు గోదాములలో స్థలం సిద్ధం చేయాలి

◆ పెద్దపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ధాన్యం స్టోర్(నిల్వ) చేసేందుకు గోదాములలో స్థలం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలంలో పర్యటించారు. పెద్దపల్లి మండలం లోని ప్రభుత్వ ఆయుర్వేద హోమియో యునాని వైద్య కళాశాల, రాఘవపూర్ లోని జిఎంఆర్ వేర్ హౌసింగ్ గోదాములను, శాంతి నగర్ లోని వేర్ హౌసింగ్ గోదాములను అదనపు కలెక్టర్ వేణు తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాబోయే యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగానే ఎస్.డబ్ల్యూ.ఎస్ పరిధిలో ఉన్న గోదాములలో ఖాళీ స్థలం ధాన్యం స్టోర్(నిల్వ) చేసుకునేందుకు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గోదాములలో ఉన్న బియ్యం త్వరగా లిఫ్ట్ చేసి ధాన్యం స్టోర్ చేసుకునేందుకు వీలుగా స్థలం కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయుష్ ఆసుపత్రి నందు వస్తున్న రోగుల వివరాలు, అందుబాటులో ఉన్న మందులు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రికి అవసరమైన మందుల స్టాక్ ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయూష్ ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డి సి హెచ్ ఎస్. డా.శ్రీధర్,డా. మారుతి ,డి.సి.ఎస్. ఓ.శ్రీనాథ్, డి.ఎం. సివిల్ సప్లై శ్రీకాంత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

◆ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాలకుర్తి మండలంలో పర్యటించారు. పాలకుర్తి మండలంలోని తహసిల్దార్ కార్యాలయం, కన్నాల మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల, కన్నాల అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, తహసిల్దార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ప్రకారం రిజిస్ట్రేషన్ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూ భారతి పోర్టల్ లో వచ్చే దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత సామాగ్రిని పూర్తిస్థాయిలో విక్రయించాలని అన్నారు. కన్నాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ప్రాథమిక విద్య ప్రమాణాలు అదే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం పాలకుర్తి మండలం లోని నక్కి రెడ్డి పల్లి(కన్నాల) అంగన్వాడి కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసి అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎదుగుదల పై శ్రద్ధ పెట్టాలని, నిబంధనల ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.ఈ పర్యటనలో తహసిల్దార్ సునీత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు....

◆ ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి ◆ పాలకుర్తి ఏఈ పై చర్యలు తీసుకోవాలి ◆ ఆర్టిజన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేపీసీ చైర్మన్ తూళ్ల నాగరాజు




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23,667మంది ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయటంతో పాటు, సమస్యలు పరిష్కరించాకపోతే సమ్మె తప్పదని ఆర్టిజన్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేపీసీ చైర్మన్ తూళ్ల నాగరాజు అన్నారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను వెంటనే కన్వర్షన్ ఇవ్వాటంతో పాటు, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డు(ఏపీఎస్ఈబీ) సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలన్నారు. 2016కు ముందు అన్ని అర్హతలు ఉండి అర్టిజన్లుగా గుర్తించని వారందరినీ, అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.విద్యుత్ సంస్థల్లో విద్యుత్ రీడర్లు, ఎస్‌పీఎం, పీఏపీ, గార్డెనర్, సెక్యూరిటీ, ఏపీటీఎస్ విజిలెన్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారందరికీ జీవో నెంబర్11 ప్రకారం కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు 30రోజుల పని విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఈనెల 26,30 తేదీల్లో డివిజన్ కార్యాలయాల వద్ద ధర్నా, ఏప్రిల్ 2న సర్కిల్ కార్యలయాల వంటావార్పు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 7న 'ఛలో వరంగల్' పేరిటెన్సీడీసీఎల్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపడుతామని, అప్పటికి స్పందన లేకపోతే ఏప్రిల్8న ఉదయం 9గంటల నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. అలాగే పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పర్యిధిలో పనిచేస్తున్నా అర్టిజన్ కార్మికుడు గడ్డం జయదేవ్‌ను వేధిస్తూన్నా, ఏఈ మాభాల ప్రసాద్ పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గడ్డం జయదేవ్ ఒక్కడు కాదని, అతని వెంట రాష్ట్రంలో పనిచేస్తున్నా 23వేల మంది అర్టిజన్లు ఉన్నారన్నారు. తక్షణమే అతడి పై చర్యలు తీసుకోకపోతే ఏఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ ? కంపెనీ అర్గనైజింగ్ సెక్రటెరిఎండి. ఖలీమోద్దీన్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఎం. క్రిష్ణారెడ్డి, జిల్లా కో కన్వీనర్ ఎం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లా కేంద్రంలోని రంగంపల్లి వద్ద అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చాలంటూ మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ కు పట్టణవాసి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. రంగంపల్లి కోర్టు సమీపంలో నిర్మిస్తున్న అపార్ట్మెంట్ వారు నిబంధనల మేరకు అనుమతులు పొంది, అందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఐదు అంతస్థులకే అనుమతి తీసుకోని, అనుమతి లేకుండా దాని పైన మరో మూడు అంతస్థులు నిర్మించారని, వాటి నిర్మాణంలో ఇతర శాఖల అధికారులను మోసగించడంతో పాటు ప్లాటు కొనుగోలు చేసిన వారు సైతం మోసపోయే అవకాశమున్నదన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వ శాఖల అధికారులను, అమాయక ప్రజలను మోసగించి, అక్రమ పద్ధతుల్లో ఆదాయాన్ని ఆర్జించడమే లక్ష్యంగా వెలసిన బిల్డర్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా కొనుగోలుదారులను ఆశ పెట్టి మోసం చేసేలా లక్కీ డ్రా పేరుతో అమ్మకాలు చేస్తున్నా యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తి పైన ఎలాంటి అనుమతి లేకున్నా నిర్మించి 3 ప్లాట్ లను పూర్తిగా కూల్చి వేయించి అమాయక ప్రజలు వాటిని కొనుగోలు చేసి మోసపోకుండా కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం



**తిమ్మాపూర్, మార్చి24(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ గుజ్జుల శ్వేతా రెడ్డి ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ వారు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.క్షయ లక్షణాలు, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి లక్షణాలను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకున్నట్లయితే వ్యాధి పూర్తిగా తగ్గుతుందని సూచించారు. గ్రామంలో క్షయ లక్షణాలను గుర్తించి టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసిన అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ భర్త ప్రణీత్ రెడ్డి, టిబి.కో-ఆర్డినేటర్ పారిజాతం, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ,ఉపాధ్యాయులు, అంగన్వాడి ఉపాధ్యాయురాలు సునీత, ఆశా వర్కర్లు స్వరూప, మమత, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అధిక ఆస్తి పన్నులపై ఆర్టిఐ సమాచారం కోరిన కార్పొరేటర్ కాల్వ మల్లేశం



**తిమ్మాపూర్, మార్చి24(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో అధికంగా విధిస్తున్న ఆస్తి పన్నులపై స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేశం ఆధ్వర్యంలో స్థానికులు సమాచార హక్కు చట్టం 2005 ద్వారా ఆర్టిఐ సమాచారం కోరుతూ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏడు సంవత్సరాల క్రితం కార్పొరేషన్ లో విలీనమైన అలుగునూరులో ప్రస్తుతం విధిస్తున్న ఆస్తి పన్నులు అధికంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఎనభై శాతం వ్యవసాయంపై ఆధారపడి దినసరి కూలీలుగా ఉన్న స్థానిక ప్రజల ఆదాయాలు పెరగకపోయినా పన్నులు మాత్రం పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని తెలిపారు.ఈ నేపథ్యంలో గ్రామ విలీనానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు,పన్నుల విధానం గత ఏడు సంవత్సరాల పన్నుల పెంపు వివరాలు, లెక్కింపు విధానం ప్రస్తుత రేట్లు వంటి అంశాలపై పూర్తి సమాచారమివ్వాలని అధికారిని కోరారు. నగరంలోని బస్టాండ్, గడియారం,భగత్ నగర్,గీతా భవన్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా ప్రాంతాల్లో పన్నుల విధానంపై వివరాలు తెలిపి వాటికి అలుగునూర్ కు ఉన్న తేడాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ముంజ సంపత్ కుమార్, ఎలవేని రాజు కుమార్, సిరిసిల్ల అనిల్ కుమార్,తోర్తి ప్రశాంత్,ఎండి ఫయాజ్,ఎండి అజ్మత్ తదితరులు కార్పోరేటర్ తో పాటు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

# ఈ ఐదుగురు మెంతులకు దూరంగా ఉండాలి..

అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి, అద్భుతమైన ప్రయోజనాలను పొందడానికి మెంతి గింజలను తీసుకుంటారు. మెంతి గింజల వల్ల కలిగే ప్రయోజనాల గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఇవి చాలా ఆరోగ్యకరమైనవి. కానీ కొంతమంది మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కోవచ్చు. మీ శరీరంలో కింద పేర్కొన్న కొన్ని సమస్యలు ఉంటే, మీరు మెంతులు తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మెంతులను ఎవరు తీసుకోకూడదు దయాబెటిస్: మెంతి గింజలు చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో దీని వినియోగం మధుమేహాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. మధుమేహ రోగులు మెంతి గింజలను తీసుకునే ముందు వారి వైద్యుడిని సంప్రదించాలి. అలర్జీ: కొందరికి మెంతి గింజల వల్ల అలర్జీ రావచ్చు. అందువల్ల మీరు మెంతులు వైద్యపరమైన ప్రతిచర్య ఏదైనా సూచనను కలిగి ఉంటే, మీరు దానిని నివారించాలి. అల్సర్: మెంతుల వినియోగం అల్సర్ రోగులకు హానికరం. ఈ రోగులు మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కొంటారు. హార్మోన్ల అసమతుల్యత: కొన్ని సందర్భాల్లో మెంతి గింజల అధిక వినియోగం హార్మోన్ల స్థాయిలను భంగం చేస్తుంది. అందుకే హార్మోన్ల అసమతుల్యత లక్షణాలు ఉన్న వ్యక్తులు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. శరీర ఉష్ణోగ్రత అసమతుల్యత: కొంతమందికి మెంతులను తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలో అసమతుల్యత ఏర్పడవచ్చు. ఇది శారీరక సమస్యలను కలిగిస్తుంది. ఈ సమస్యలన్నీ ప్రతి వ్యక్తికి రావని గమనించండి. అయితే మీకు ఈ సమస్యలు ఏవైనా ఉంటే మీరు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

# ఎం.సి.హెచ్ ద్వారా మెరుగ్గా వైద్య సేవలు

**● ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి ● మాత శిశు సంరక్షణ కేంద్రం పని తీరుపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గర్భిణీ మహిళలకు ఎం.సి.హెచ్ ద్వారా మెరుగ్గా వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రం పనితీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రసవానికి దగ్గర్లో ఉన్న గర్భిణుల వివరాలు తప్పనిసరిగా మన ఈ.డి.బీ రిజిస్టర్ లో నమోదు కావాలని కలెక్టర్ తెలిపారు. 102 అమ్మ ఒడి వాహనాల ద్వారా గర్భిణీ మహిళలను ఆసుపత్రికి తీసుకొని వచ్చి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో 182 ప్రసవాలు ఎం.సి.హెచ్ లో జరిగాయని, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు మరింత పెరగాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు అందించే సమాచారం సూపర్వైజర్లు క్రాస్ చెక్ చేయాలని అన్నారు. 102 అమ్మ ఒడి సేవలు మరింత మెరుగ్గా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రసవం తర్వాత కూడా తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. బాలింతలకు, శిశువులకు రెగ్యులర్ టీకాలు వేయాలని కలెక్టర్ సూచించారు. మంథని ఎం.సి.హెచ్ గతంతో పోలిస్తే మెరుగ్గా పని చేస్తుందని, మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వైద్యులు ఓపి సేవలు టోకేన్ ప్రకారం అందించాలని అన్నారు. ఓపి తర్వాత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు



డ్యూటీ డాక్టర్ తప్పనిసరిగా ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో అడ్మిషన్ ఎట్టి పరిస్థితుల్లో తిరస్కరించడానికి వీలు లేదని అన్నారు. ఆసుపత్రిలో రోగులకు, సహాయకులకు అవసరమైన సీటింగ్ అరేంజ్మెంట్ ఏర్పాటు చేయాలని అన్నారు. సెక్యూరిటీ, నర్సింగ్ స్టాఫ్ రోగులతో ప్రవర్తించే తీరు మెరుగుపడాలని అన్నారు. టాయిలెట్స్ రెగ్యులర్ గా క్లీన్ చేస్తూ శుభ్రంగా ఉంచాలని, నిబంధనల మేరకు ఆసుపత్రి పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎస్.ఆర్ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

**- సీఎస్ఆర్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సి.ఎస్.ఆర్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి పైసంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సిఎస్ఆర్ క్రింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలం పరిధిలో సిఎస్ఆర్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు వాటి ప్రస్తుత స్థితిగతులపై నివేదిక అందించాలని అన్నారు. సింగరేణి ద్వారా రామగుండం పరిధిలో ఐదు కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిఎస్ఆర్ నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పెట్టామని, అవి మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు ఎప్పటికప్పుడు జరిగేలా చూడాలని అన్నారు. రామగుండం లో ఉన్న గ్రంథాలయ ఆధునికరణ, ఫర్నిచర్, అవసరమైన బుక్స్, ఇతర సదుపాయాల కల్పన కోసం నిధులు వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. ఎన్టిపిసి యాష్ పాండ్ వద్ద ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వసించాలని కలెక్టర్ సూచించారు. సీఎస్ఆర్ నిధులతో చేసే అభివృద్ధి పనులకు సంబంధించిన యూసి లు ఎప్పటికప్పుడు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తేనెటీగల పెంపకంపై జరిగే శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

**● ప్రిన్సిపల్ .పి .పద్మ**

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** నగరం నడిబొడ్డున అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న ఏ.వి కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై సర్టిఫికేట్ కోర్సు ను శిక్షణ కార్యక్రమం ద్వారా విజయవంతంగా ప్రారంభించి కొనసాగిస్తున్నాం. కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. పద్మ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న ఈ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఒక సర్టిఫికెట్ కోర్సు,గా రూపొందించి దాని ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు మరియు స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషిస్తున్న యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోంది. ఈ సర్టిఫికేట్ కోర్సు ఈ కోర్సు ద్వారా తేనెటీగల జీవన విజ్ఞానం, వర్గీకరణ, తేనెటీగల రకాలు, వాటి పెంపకం, పెంపకానికి దారి తీసే సాంకేతిక అంశాలు, తేనెటీగల సంరక్షణ పద్ధతులు, తేనె తీసే విధానం, మరియు మైనం ఉత్పత్తులు,ఇతర రకాల ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మరియు మార్కెటింగ్ వంటి విభిన్న అంశాలపై సమగ్ర శిక్షణ అందిస్తున్నాం. అనుభవజ్ఞులైన నిపుణులు మరియు అధ్యాపకులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే వారికి తేనెటీగల పెంపక పరిజ్ఞానాన్ని సున్నితంగా, సురక్షితంగా, సహజ వాతావరణం లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి వృక్షశాస్త్ర విభాగాధిపతి వై. శ్రీనివాస్ రెడ్డి , అలాగే అధ్యాపకులు ఎ. చంద్రశేఖర్ రెడ్డి మరియు సి. హెచ్. నాగేష్ ఈ శిక్షణ కార్యక్రమంలో సంయుక్తంగా పాల్గొని, తమ అనుభవాన్ని విద్యార్థులతో పంచుకుంటున్నారు. ప్రత్యక్ష ప్రదర్శన మరియు, ప్రాక్టికల్ సెషన్ల ద్వారా పాల్గొనేవారికి తేనెటీగల పెంపకంపై పూర్తి అవగాహన కల్పించబడుతోంది. ఈ కోర్సు ద్వారా గ్రామీణ ప్రాంతాల యువత తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించుకుంటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. పద్మ గారు మాట్లాడుతూ, తేనెటీగల పెంపకం వ్యవసాయానికి అనుబంధంగా ఆదాయ వనరులను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఒక కిలో తేనె కోసం దాదాపు నలభై వేల తేనెటీగలు నాలుగు లక్షల పూల మొక్కలపై వాలి మకరందం సేకరించి ఒక కిలో తేనెను ఉత్పత్తి చేస్తాయి. అదేవిధంగా ఈ తేనెటీగలు ప రపరాగ సంపర్కంలో ఉపయోగపడి పుప్పడి రేణువుల ద్వారా ఒక మొక్క పై నుంచి ఇంకొక మొక్క పైకి వాలి మకరందాన్ని వ్యాపించడం వల్ల సహజంగా మొక్కల్లో ఫలదీకరణ జరుగుతుంది. ఈ



ఫలాదీకరణ ద్వారానే కాయలు, ధాన్యాలు, ఆహార పదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఒకవేళ తేనెటీగలే లేక పోయినట్టయితే మానవాళికి ఆహారం లభ్యం కావడం మృగ్యం అవుతుంది. భూమిపై జీవకోటికి ఆహారాన్ని అందిస్తూ జీవావరణం లో తమ వంతు పాత్రను తేనెటీగలు నిర్వహిస్తున్నాయి. తేనెటీగల నుంచి మనకు తేనె ఒక్కటే లభిస్తుంది అని అనుకుంటాము. కానీ జీవకోటికి ఇతోదికంగా ఆహార ధాన్యాల ఉత్పత్తులకై అవిరాళంగా కృషి చేస్తూ ఉంటాయి. ఒకవేళ తేనెటీగల ఉనికి లేకపోయినట్లయితే భూగ్రహం పైన జీవకోటి ఉనికి అనేది ఉండదు. ఈ విధంగా జీవావరణం లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. అంటూ విషదికరిస్తూ తేనెటీగల ఉపయోగాల గురించి ఆమె విపులంగా వివరించారు. తేనెటీగల పెంపకం వాటి సంరక్షణ పై ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాలతో పాటు దీన్ని ఒక పరిశ్రమగా స్థాపించుకునే వెసులుబాటు ఉంటుంది. ఎంతో మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఈ శిక్షణ కార్యక్రమం గౌరవప్రదమైన జీవనాన్ని అందిస్తుంది. అనడంలో ఎలాంటి సందేహము లేదు. అందుకొరకే ఈ కార్యక్రమాన్ని మేము సర్టిఫికెట్ కోర్స్ ద్వారా అందిస్తున్నాము. అని ఆంధ్ర విద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి పి. పద్మ గారు ఒక సంయుక్త ప్రకటనలో మీడియా ముఖంగా సెలవిచ్చారు. వృక్షశాస్త్ర విభాగం నిర్వహిస్తున్న ఈ కోర్సుకు మంచి స్పందన లభిస్తున్నదని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని ఈ కోర్సులో ప్రవేశం పొందిన ప్రతి ఒక్కరికి గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందజేస్తామని ఆమె తెలిపారు.

# మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఉప వైద్యాధికారి





**మానకొండూర్, మార్చి24(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని జిల్లా ఉప వైద్యాధికారి వైద్యులు రాజగోపాల్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుండి ఆయా విభాగాల్లో సమస్యలపై వచ్చిన ప్రజలను వైద్యులు పరీక్షించి,రక్త పరీక్షలతో పాటు ఏఎంసి పరీక్ష చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ఎండీ.సల్మాన్ మాట్లాడుతూ.... ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా గవర్నమెంట్ మెడికల్ కళాశాలలోని స్త్రీల, పిల్లల, జనరల్, ఎముకలు, కంటి,పంటి విభాగాలకు చెందిన 6గురు ప్రత్యేక వైద్య నిపుణులచే మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామానికి 15,20 మంది చొప్పున వివిధ గ్రామాల నుండి సుమారు 250 మంది వైద్యశిబిరానికి వచ్చి వైద్య పరిక్షలు చేసుకున్నారని, వీటితో పాటు మహిళలకు "సర్వైకల్ క్యాన్సర్" చికిత్స కూడా అందించడం జరుగుతుందని గ్రామాల్లోని మహిళలు ఎటువంటి అనుమానం లేకుండా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సల్మాన్ కోరారు. ఎంఎల్హెచ్పి వైద్యురాలు మానస, ఆరోగ్య కేంద్ర సిహెచ్ఓ. బదావత్ రాజు నాయక్, డిపిఎమ్ఓ కృపలాదేవి, హెల్త్ సూపర్వైజర్ల, జుబేర్, స్నేహలత, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, వివిధ గ్రామాల ఆశా వర్కర్లు మెగా వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

# యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**● ప్రభుత్వ ఐటిఐలో ఘనంగా షహీద్ దివస్...**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) లో 'మై భారత్' ఆధ్వర్యంలో షహీద్ దివస్ (అమరవీరుల సంస్మరణ దినోత్సవం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగాలను స్మరిస్తూ విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ లు మాట్లాడుతూ యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులకు దేశభక్తి అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి శ్రమదానం నిర్వహించారు. మొక్కల సంరక్షణ



మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చైతన్య ర్యాలీ "మేరా యువ భారత్ - పెద్దపల్లి" జాతీయ జెండాలతో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, యువజన సంఘాల నాయకులు శ్రీనివాస్, రాకేష్, మహేష్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలయానికి రహదారి వెడల్పు పనులు ప్రారంభం



**తిమ్మాపూర్, మార్చి24 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులోని స్వయంభూ శ్రీ లక్ష్మీ గణపతి ఆలయానికి రహదారి వెడల్పు పనులను ఆలయ కమిటీ అధ్యక్షుడు కంది అశోక్ రెడ్డి, డీసీసీ కార్యాలయ ఇన్చార్జి గోపు మల్లారెడ్డి మంగళవారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. వరంగల్ రోడ్ లోని బొల్లాడి నర్సింహారెడ్డి ఇంటి నుండి గుడమట్ల కాలువ వరకు 24ఫీట్ల వెడల్పుతో రహదారిని విస్తరించి అక్కడి నుండి దేవాలయం వరకు ముప్పై ఫీట్ల వెడల్పుతో దారిని అభివృద్ధి చేయనుండగా దీనికై స్థానికులు తమ ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములను స్వచ్ఛందంగా ఇవ్వడానికి ముందుకు రావడం విశేషం. గత కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సైతం ఆలయానికి శాశ్వత రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వగా, భక్తుల కోరికలు తీరుస్తూ శ్రీలక్ష్మీ గణపతి ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రహదారి వెడల్పు పనులు ప్రారంభం కావడం ఆనందదాయకమని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమ అరెస్టులు అమానుషం

**- కాంగ్రెస్ ఆరు గ్యారంటీ అమలు చేయాలి - బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బిఆర్ఎస్, బిఆర్ఎస్వీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అమానుషమని, కాంగ్రెస్ మేనిఫెస్టో లోని 6 గ్యారంటీలను అమలు చేయాలని బిఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ డిమాండ్ చేశారు బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో "అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమం ఉండగా, తెల్లవారుజామున బిఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ ను, మండల యూత్ అధ్యక్షులు కొయ్య విక్రమ్ ను, చొప్పరి వంశీలను పోలీసులు అక్రమ అరెస్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పు రాజ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులు మరియు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే ఇప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు, విద్యార్థినిలకు స్కూటీలు వంటి హామీలు ఇంకా అమలుకాలేదని, ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**బెజ్జంకి, మార్చి24(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో విలాసాగరం అరుణ, దాచారంలో దయ్యాల జితేందర్ ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, దీటి బాల నర్సు,దూమాల మహేష్, సోషల్ మీడియా ఇంచార్జి ఎల శేఖర్ బాబు,మాజీ పాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్ తదితరులు రసమయి వెంట పరామర్శలో పాల్గొన్నారు.

# రైల్వే శాఖ షాకింగ్ నిర్ణయం..

## రూ. 30వేల కోట్ల వందేభారత్ రైళ్ల టెండర్ రద్దు..



దేశంలో ప్రముఖ రవాణా సాధనమైన రైల్వే ను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా నూతనంగా వందేభారత్ రైళ్లను నడుపుతోంది. వీటిని మరింత గా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా వంద వందే భారత్ రైళ్ల తయారీకి ఆల్‌స్టోమ్ ఇండియా కంపెనీతో గతంలో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఈ 30 వేల కోట్ల టెండర్ ను ఇటీవల భారతీయ రైల్వే రద్దు చేసుకుంది. ఈ నిర్ణయం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఒక్కో రైలుకు రూ.150.9 కోట్ల బిడ్.. వందే భారత్ రైళ్ల కోసం 2023 మే 30వ తేదీన తెరిచిన టెండర్లలో ఆల్‌స్టోమ్ కంపెనీ అత్యల్ప బిడ్డర్ గా నిలిచింది. ఈ కంపెనీ ఒక్కో రైలు తయారీకి రూ.150.9 కోట్ల బిడ్ వేసింది. అయితే ఈ ధర ఎక్కువగా ఉందని రూ.140 కోట్లకు తగ్గించుకోవాలని రైల్వే కోరింది. కానీ రూ.145 కోట్లకు ఒప్పందం కుదుర్చుకోవాలని ఆ కంపెనీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ధర ఎక్కువగా ఉండడంతో రైల్వే ఈ రూ. 30 వేల కోట్ల టెండర్ ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. వంద వందే భారత్ అల్యూమినియం బాడీ రైళ్ల తయారీతో పాటు నిర్వహణ కోసం ఈ టెండర్ ను వేశారు. రద్దు విషయం నిజమే.. భారతీయ రైల్వే టెండర్ ను రద్దు చేసుకున్న విషయాన్ని ఆల్‌స్టోమ్ ఎండీ ఒలివియర్ లోయిసన్ ధ్రువీకరించారు. ఆర్డర్‌ను రద్దు చేసినప్పటికీ భవిష్యత్తులో అవసరమైతే మద్దతు ఇవ్వడానికి తమ కంపెనీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఒక్కో రైలుకు ఈ కంపెనీ వేసిన రూ.150.9 కోట్ల ధర ఎక్కువగా ఉందని రైల్వే టెండర్ ప్యానెల్ గుర్తించింది. దాన్ని రూ. 140 కోట్లకు పరిమితం చేయాలని కోరింది. అయితే ఒక్కో రైలు సెట్‌కు రూ.145 కోట్లతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆల్ స్టోమ్ భావించింది. రైల్వే తెరిచిన రూ. 30వేల కోట్ల టెండర్‌కు వీరిదే అత్యల్ప బిడ్. మరో బిడ్ అయిన స్విస్ తయారీదారు స్టాడ్లర్ రైల్, హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్‌లతో కూడిన కన్సార్టియం ఒక్కో రైలు సెట్‌కు రూ. 170 కోట్ల బిడ్ వేసింది. గతంలో ఇలా.. గతంలో 200 వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్‌ల తయారీకి ఒక రేక్‌కు రూ. 120 చొప్పున గతంలో కాంట్రాక్ట్ మంజూరు చేసినట్లు రైల్వే అధికారి తెలిపారు. ప్రస్తుతం ఉన్న బిడ్ లో ఈ ధర ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి టెండర్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం కొన్ని నిబంధనలను సవరించనున్నారు. గతంలో మాదిరిగా కేవలం రెండు కంపెనీలే కాకుండా ఈసారి ఎక్కువ కంపెనీలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటారని సమాచారం. అర్హతలు.. టెండర్ కు వచ్చే కంపెనీలకు కొన్ని అర్హతలు ఉండాలి. అవి ఏడాదికి కనీసం ఐదు రైలుసెట్లను తయారు చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. ఇందుకోసం వాటికి పరిశోధన మరియు అభివృద్ధి సౌకర్యం అవసరం. రైల్వే క్లాంట్రాక్ట్ ప్రకారం.. ఏడు సంవత్సరాలలోపు వంద రైలు సెట్టు డెలివరీ చేయాలి. గెలిచిన బిడ్డర్ డెలివరీ తర్వాత రూ.13 వేల కోట్లు అందుకుంటారు. ఆ తర్వాత 35 ఏళ్ల పాటు నిర్వహణ కోసం అదనపు రూ.17 వేల కోట్లు అందిస్తారు. హర్యానాలోని సోనేపట్ లో ఈ రైళ్లను తయారు చేయాలి.

# ఆ బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న వారికి షాక్!



మరింత భారం కానున్న ఈఎంఐ.. పూర్తి వివరాలు.. మన దేశంలో వివిధ రుణాలపై వడ్డీ రేట్లు పెరగనున్నాయి. బ్యాంకులు ఈ మేరకు తమ రేట్లను సవరించాయి. దేశంలోని ప్రముఖ బ్యాంకులు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాక్, కెనరా బ్యాంక్ వంటివి ఇప్పటికే తమ బ్యాంకుల్లో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు(ఎంసీఎల్ఆర్)ను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఆగస్టు 12 నుంచి ఈ సవరించిన రేట్లు అమలులోకి వచ్చాయి. ఇప్పటికే ప్రముఖ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)తో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఎంసీఎల్ఆర్ ను పెంచాయి. ఈ క్రమంలో రుణ గ్రహీతలపై భారం ఎలా ఉంటుంది? ఏ బ్యాంకు ఎంత మేర ఎంసీఎల్ఆర్‌ను పెంచింది? తెలుసుకుందాం రండి.. కారణం ఇదే.. ఆగస్టు 8న జరిగిన సమావేశంలో ఆర్‌బీఐ మానిటరీ పాలసీ నేపథ్యంలో రెపో రేటును 6.50 శాతం వద్ద కొనసాగించింది. దానిలో ఎటువంటి మార్పు చేయలేదు. దీంతో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) , కెనరా బ్యాంక్, యూకో బ్యాంక్లు ఎంసీఎల్ఆర్ ను పెంచుతున్నట్లు గత శుక్రవారం ప్రకటించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఆగస్టు 12 నుంచి అమలులోకి వచ్చేటటువంటి నిర్దిష్ట అవధులపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ పెంచాలని బీఓబీ నిర్ణయించింది. ఈ పెరుగుదల తర్వాత ఎంసీఎల్ఆర్ రేటు ఆరునెలలకు 8.75 శాతం, ఒక సంవత్సరానికి 8.95 శాతం ఉంటుంది. కెనరా బ్యాంక్.. ఈ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్ఆర్ ను ఆగస్టు 12 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచాలని నిర్ణయించింది. ఈ పెరుగుదల తరువాత.. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.80, ఒక సంవత్సరానికి 9 శాతం అవుతుంది. యూకో బ్యాంక్.. దీనిలో కొత్త రేట్లు ఆగస్టు 10 నుంచి అమలులోకి వచ్చాయి. నిర్దిష్ట కాలపరిమితిపై 5 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ ను పెంచాలని బ్యాంక్ నిర్ణయించింది. సవరించిన ఆరు నెలల, ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ వరుసగా 8.80 శాతం, 8.95 శాతంగా ఉంది. ఫ్లోటింగ్ రేట్ ఉన్న వారికి.. ఇప్పటికే రుణాలు కలిగి ఉన్న వారిపై ఈ చర్య కారణంగా ఈఎంఐ భారం పెరగనుంది. అయితే ఫిక్స్ డ్ వడ్డీ ఉంటే ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఫ్లోటింగ్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్ పై లోన్ తీసుకున్న వారిపై ఈ భారం పడనుంది. ఈ బ్యాంకులు ఇప్పటికే.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత నెలలోనే ఎంసీఎల్ఆర్ రేటును 5-10 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనిలో ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.85 శాతం వద్ద ఉన్నాయి. ఈ నెల ప్రారంభంలో, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా తన ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, ఏడాదికి 8.90 శాతంగా ఉంది. అలాగే బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ ని ఆగస్టు 1 నుంచి 5 బేసిస్ పాయింట్లు పెంచి 8.95 శాతానికి పెంచింది. ఇండియన్ బ్యాంక్ తన ఓవర్‌నైట్ తో పాటు ఒక నెల ఎంసీఎల్ఆర్ ని ఒక్కొక్కటి 5 బేసిస్ పాయింట్లు పెంచి వరుసగా 8.20 శాతం, 8.45 శాతానికి పెంచింది. ఇవి ఆగస్ట్ 3 నుంచి అమలులోకి వచ్చాయి.

# నెలకు రూ. 1లక్ష పెన్షన్ కావాలా? ఇలా చేస్తే.. సాధ్యమే..



మన దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పెన్షన్ పథకాలలో నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) ఒకటి. దీనిలోని ఫీచర్లు, ప్రయోజనాలు అందరినీ ఆకర్షిస్తాయి. వాస్తవానికి ఇది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రారంభించిన పథకం. అయితే ఆ తర్వాత ఇది వేగంగా అప్ డేట్ అవుతూ విస్తరించింది. ఈ పథకాన్ని 2004లో ప్రవేశపెట్టారు. ఎన్పీఎస్ సాయిధ దళాల్లోని వారిని మినహాయించి, మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఆ తర్వాత 2009 మేలో భారత పౌరులందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పథకంలో 18ఏళ్లు నిండి 70 ఏళ్ల మధ్య ఉన్న వారు ఎవరైనా పెట్టుబడులు పెట్టొచ్చు. భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకునేందుకు ఇది విలువైన ఎంపికగా పనిచేస్తుంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) నియంత్రణలో ఈ ఎన్‌పీఎస్ పనిచేస్తుంది. ఇది మార్కెట్-లింక్డ్ డిఫైన్డ్ కాంట్రిబ్యూషన్ స్కీమ్. పదవీ విరమణ తర్వాత సాధారణ ఆదాయాన్ని అందించే కార్పస్ ను నిర్మిస్తుంది. ఇప్పుడు ఈ పథకంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రూ. లక్ష నెలవారీ పెన్షన్ పొందే అవకాశం కూడా ఉంది. అది సాధ్యమా అంటే.. అవుననే చెబుతున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో ఎన్‌పీఎస్ ద్వారా నెలకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే ఎంత పెట్టుబడి పెట్టాలి? ఎన్ని సంవత్సరాలు పెట్టాలి? వంటి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. రూ. 1 లక్ష నెలవారీ పెన్షన్ రావాలంటే.. మీరు పదవీ విరమణ చేసిన తర్వాత మీ ఎన్‌పీఎస్ పెట్టుబడుల నుంచి నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందాలనుకుంటే కొన్ని అంశాలు ప్రాథమికంగా గుర్తుంచుకోవాలి. అవేంటంటే.. మీరు పెట్టుబడి ప్రారంభించే వయసు, ప్రతి ఏటా పెట్టుబడి పెంచుకుంటూ వెళ్లే ప్రణాళిక ఉండాలి. అప్పుడే మీకు అంది సాధ్యమవుతుంది. ఉదాహరణకు 35 ఏళ్ల వయస్సులో ఎన్‌పీఎస్ ప్రారంభించి, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందుతారు అనుకుందాం.. ఆ సమయానికి మీకు రూ. లక్ష పెన్షన్ రావాలంటే.. మీ పెట్టుబడులు వార్షికంగా 10 శాతం పెంచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడే మీ లక్ష్యాలను చేరుకోగలుగుతారు. మీరు 6 శాతం వార్షిక రాబడితో యాన్యుటీని కొనుగోలు చేయడానికి మీ మొత్తం కార్పస్లో 60 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 17,000 కంట్రిబ్యూషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో మీరు యాన్యుటీ కోసం మీ కార్పస్లో 40 శాతాన్ని ఉపయోగిస్తే, మీరు నెలకు రూ. 34,000 విరాళంగా ఇవ్వాలి. ఈ రెండు రెండు సందర్భాల్లోనూ మీరు పదవీ విరమణ తర్వాత నెలవారీ రూ. 1 లక్ష పెన్షన్ పొందుతారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ వల్ల ప్రయోజనాలు.. నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్) అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ప్రధానమైనది పన్ను ప్రయోజనాలు. అలాగే పదవీ విరమణ కోసం క్రమపద్ధతిలో ఆదా చేసే సామర్థ్యం. క్రమశిక్షణతో కూడిన పొదుపులను ప్రోత్సహించడం ద్వారా, ఇది వ్యక్తులు ఆర్థికంగా సురక్షితమైన పదవీ విరమణ కోసం ప్లాన్ చేయడంలో సహాయపడుతుంది.

# రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ ఆధ్వర్యంలో హతసాక్షి ప్రవీణ్ పగడాల ప్రథమ వర్ధంతి

**- కరీంనగర్, కొత్తపల్లి విభాగాల శాంతి ప్రదర్శన**






**కరీంనగర్ టౌన్, మార్చ్24(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రీయ మసిహి పరిషత్ కరీంనగర్, కొత్తపల్లి విభాగాల ఆధ్వర్యంలో హతసాక్షి డా.ప్రవీణ్ పగడాల ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని నిర్వహించనున్న క్యాండిల్ సర్వీస్ (శాంతి ప్రదర్శన)క్యాండిల్ సర్వీస్ గీత భవన్, తెలంగాణ చౌక్ లో ఘనంగా నిర్వహించారు.ప్రముఖ క్రైస్తవ సువార్తీకులు 'సాక్షి అపోలోజెటిక్స్' వ్యవస్థాపకులైన డా.ప్రవీణ్ పగడాల 2025 మార్చిలో రాజమండ్రి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వారి సేవలను గుర్తుచేసుకుంటూ, వారికి నివాళులు అర్పించేందుకు వారి మృతిపై కొనసాగుతున్న విచారణలో న్యాయం జరగాలని కోరుతూ ఈ శాంతియుత క్యాండిల్ సర్వీస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి జాషువా, కరీంనగర్ నియోజకవర్గ ప్రెసిడెంట్ పడిదం జాషువా, కే డి పి ఫ్, కే సి పి ఫ్ సభ్యులు సంతోష్ కుమార్ పాస్టర్,న తాని మేలు పాస్టర్,మచ్చ డేవిడ్ పాస్టర్, సాల మోద్ రాజ్ పాస్టర్,మోజాస్ పాస్టర్, శ్రీధర్ పాస్టర్, గంగరాజు పాస్టర్, పాస్టరమ్మలు,వివిధ సంఘాల ప్రతినిధులు, క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులు నిర్వాహకులు పాల్గొన్నారు.

# లక్ష్మీపూర్ మెగా హెల్త్ క్యాంపుకు విశేష స్పందన



**మానకొండూర్, మార్చి2(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్యాధికారి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఎడ్ల సత్యనారాయణ, ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ తోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి వివిధ వైద్య పరిక్షలు చేయించుకున్నారు. వార్డు సభ్యులు రాపాక మధుకర్, నగునూరి సంపత్, ఎర్ర అనిల్, వివిధ విభాగాల వైద్య నిపుణులు. సౌమ్య, వినీత్ కుమార్, ఎండి హారిస్,భరత్ రాజ్,రాజి రెడ్డి,వెంకట భరద్వాజ్, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చిన్న హనుమాన్ జయంతికి కట్టు దిట్టమైన భారీ ఏర్పాట్లు...

**- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్...**



**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీకొండగట్టు అంజన్న ఆలయంలో జరగబోయే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు. జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రఘు చందర్, సీఐ నీలం రవి, ఆలయ ఈవో అంజాన రెడ్డి, కార్యనిర్వాహణ అధికారులు తదితరులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శన క్యూలైన్లు, తాగునీరు, చలువ పందిళ్లు, పారిశుధ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో ప్రసాదం, వైద్య శిబిరాలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో వెల్లడించారు.

# పైప్ లైన్ వేసేందుకు అధికారులకు సూచనలు




**సుల్తానాబాద్ , మార్చి 24 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు అమృత్ 2.0 పథకం కింద పలు అభివృధి పనులు వేగవంతం అయ్యాయి ఈ పథకంలో భాగంగా ప్రధానంగా త్రాగునీటి సరఫరా మెరుగుదల కొరకు సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణములో పెరిక గిద్ద హనుమాన్ టెంపుల్ సమీపములో ఉన్న మెయిన్ ట్యాంక్ పరిధిలోని ప్రజలు ప్రస్తుతం తాగునీటి సరఫరాలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని. మెయిన్ ట్యాంక్ నుండి సబ్ ట్యాంక్ లకు పైప్ లైన్ వేసే ప్రక్రియ ఏ విధంగా వేయాలనే దానిపై మున్సిపల్ కమిషనర్ రమేష్ కు ఏ ఏఈ కి అలాగే అమృత్ కాంట్రాక్టర్స్‌కి మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ మంగళవారం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అవార్డు కౌన్సిలర్ రాజు. కౌన్సిలర్లు వర ప్రదీప్. ఈర్ల స్వరూప శేఖర్ పాల్గొన్నారు.ం

# బాదం పప్పు నానబెట్టి తింటే మంచిదా? లేదంటే పచ్చిగా తింటే మంచిదా?

చాలా మందికి రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పు తినడం అలవాటు. అయితే బాదంపప్పు నానబెట్టి తింటే మంచిదా.. లేదంటే అలాగే పచ్చిగా తింటే మంచిదా అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. బాదంపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ మీరు సరైన పద్ధతిలో తింటేనే ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి బాదంపప్పును పచ్చిగా తినాలా? నానబెట్టి ఎలా తినాలా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బాదంలో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇవి శరీరానికి పోషకాలను అందిస్తాయి. బాదం పప్పును ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసంరాత్రి పడుకునే ముందు కొన్ని బాదంపప్పులను నీళ్లతో వేసి నానబెట్టాలి. అలాగే బాదంపప్పును స్నాక్‌గా కూడా తినవచ్చు. పచ్చి వాటి కంటే నానబెట్టిన బాదం శరీరానికి ఎక్కువ మేలు చేస్తుంది. అలాగే బాదం షేక్ చేసి కూడా తాగొచ్చు. కానీ బాదంలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు పెరగడానికి దారితీయవచ్చు. అందుకే వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.నట్‌ఎలర్జీ ఉన్నవారు వాటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు. ఎలర్జీ ఉన్న వారు వీటికి దూరంగా ఉండటం బెటర్.

# జీర్ణ ఆరోగ్యానికి పచ్చిమిర్చి..

## ప్రతి రోజూ తిన్నారంటే మీ ఒళ్లు ఉక్కుమాదిరి తయారవుద్దంతే!





పచ్చి మిర్చిలో విటమిన్ ఎ, సి, బి-1, బి-1, బి-3, బి-5, బి-6, బి-9, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు ఎన్నో ఉంటాయి. అలాగే, పచ్చి మిరపకాయలలో ఉండే క్యాప్సైసిన్ అనే సమ్మేళనం నొప్పులను తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. పచ్చి మిరపకాయలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా భావిస్తారు మన పూర్వీకులు. అవును.. నిజంగానే పచ్చి మిర్చి కడుపు సంబంధిత సమస్యలకు బలేగా పనిచేస్తుంది. చాలా మంది వర్షాకాలంలో ఎసిడిటీ, మలబద్ధకం వంటి అనేక సమస్యలతో బాధపడు తుంటారు. వారు పచ్చి మిరపకాయలను తీసుకోవచ్చు. పచ్చిమిర్చిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పీచు జీర్ణ సమస్యలు రాకుండా కాపాడుతుంది. పచ్చిమిర్చిలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును కాపాడుకోవడానికి సహాయపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. ఇందులో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. అందువల్ల పచ్చి మిరపకాయలు తినడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడతాయి. వేసవిలో చాలా మంది హీట్ స్ట్రోక్‌తో బాధపడుతుంటారు. కాబట్టి పచ్చిమిర్చి తీసుకోవడం వల్ల హీట్ స్ట్రోక్ సమస్య నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు. రోజువారీ ఆహారంలో పచ్చిమిర్చి చేర్చుకోవాలనుకునే వారు రోజుకు 3 నుంచి 4 పచ్చిమిర్చి తీసుకుంటే సరిపోతుంది. అతిగా తింటే గుండెల్లో మంట వంటి సమస్యలు వస్తాయి. పైల్స్‌తో బాధపడే వారు పచ్చి మిరపకాయలు వంటి మసాలా ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది.

# ఈ సమస్యలున్న వారు పొరబాటున కూడా కాలీఫ్లవర్ ముట్టుకోకూడదు.. ఎందుకంటే?



కాలీఫ్లవర్‌లో ఆరోగ్యానికి మేలు చేసే అనేక విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కానీ ప్రతిరోజూ కాలీఫ్లవర్ తినడం కొంతమందికి కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. అందుకే ఈ సమస్యతో బాధపడేవారు కాలీఫ్లవర్ తినకుండా దూరంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీరు గ్యాస్, ఎసిడిటీ సమస్యలతో బాధపడుతుంటే క్యాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. క్యాలీఫ్లవర్‌లో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి జీర్ణ సమస్యలను పెంచుతాయి. అలాగే మీరు థైరాయిడ్ సమస్యలతో బాధపడుతుంటే కాలీఫ్లవర్ తినకండి. ఇది మీ సమస్యలను మరింత పెంచవచ్చు. కాలీఫ్లవర్ తినడం వల్ల థైరాయిడ్ గ్రంథి అయోడిన్‌ను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల సమస్యలు తలెత్తుతాయి. కాలీఫ్లవర్ ముఖ్యంగా 3, %4 హార్మోన్ల స్థాయిలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ రోగులు కాలీఫ్లవర్ వినియోగాన్ని తగ్గించాలి. మీకు గాల్ బ్లాడర్, కిడ్నీలో రాళ్లు ఉన్నట్లయితే కాలీఫ్లవర్ తినకపోవడమే మంచిది. కాలీఫ్లవర్‌లో క్యాల్షియం ఉంటుంది. ఇది రాళ్ల సమస్యను పెంచుతుంది. అలాగే మీకు రక్తం గడ్డకట్టే సమస్యలు ఉంటే కాలీఫ్లవర్ తినవద్దు. కాలీఫ్లవర్‌లో అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది శరీరంలోని రక్తాన్ని చిక్కగా చేస్తుంది. కాబట్టి ఇలాంటి వారు కాలీఫ్లవర్ అస్సలు తినకూడదు. గర్భధారణ సమయంలో కాలీఫ్లవర్ తినకూడదు. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా గర్భధారణ సమయంలో గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి క్యాలీఫ్లవర్‌ను నివారించడం చాలా ముఖ్యం.




## ఉదయాన్నే ఖాళీకడుపుతో ఇవి రెండంటే రెండే ఆకులు తినడం అలవాటు చేసుకోండి..! క్రమంగా మ్యాజిక్ చూస్తారు..



తులసిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రోగాల బారిన పడకుండా శరీరాన్ని రక్షిస్తుంది. సీజనల్ వ్యాధులను దూరం చేయడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. తులసి ఆకులను తినటం వల్ల మనసును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. తులసి ఆకులు పళ్లు, చిగుళ్ళ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడుతుంది. తులసి ఆకుల రసం లేదా కషాయాన్ని నోటితో పుక్కిలించి ఉమ్మేయటం వల్ల నోటి నుంచి వచ్చే వాసన తగ్గిపోతుంది. వర్షాకాలంలో తులసి ఆకులను తినడం వల్ల శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది శ్వాసకోశ వ్యవస్థను శుభ్రపరుస్తుంది. జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలను తగ్గిస్తుంది. తులసి ఆకులను నమలడం వల్ల దానిలోని పోషకాల వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. ఆకలిని నియంత్రించడంలో కూడా ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పరగడుపునే తులసి ఆకులను తినటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహం ఉన్నవారికి చాలా మంచిది. అంతేకాదు, తులసిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. రక్తపోటును తగ్గించి, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తులసిలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె వంటి అనేక రకాల విటమిన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసిలో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఎముకల ఆరోగ్యానికి, రక్త ప్రసరణకు, నరాల ఆరోగ్యానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

## ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా..? డయాబెటిస్ రోగానికి చేరువైనట్లే..



ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల మధుమేహం (డయాబెటిస్) కేసులు వేగంగా పెరుగుతున్నాయి. మధుమేహం ముందు పరిస్థితిని అంటే.. రోగం ప్రారంభానికి ముందు ప్రీడయాబెటిస్ అని పిలుస్తారు. మధుమేహం ప్రారంభ దశలో రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి.. క్రమంగా పెరుగుతుంటాయి.. అయితే.. ప్రీడయాబెటిస్‌ను గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది మధుమేహం ప్రారంభ సంకేతం.. ఈ దశలో సరైన చర్యలు తీసుకుంటే, ఈ వ్యాధిని నివారించడం సాధ్యమవుతుంది. వైద్య నిపుణుల ప్రకారం.. ప్రీడయాబెటీస్ రోగులలో రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణ లేకుండా పోయే అవకాశం ఉంది.. ఇది తరువాత టైప్ 2 మధుమేహం రూపాన్ని తీసుకోవచ్చు.. సరైన సమయంలో గుర్తించడం ద్వారా డయాబెటిస్ ను నియంత్రించవచ్చు. సరైన వైద్యాన్ని తీసుకోవచ్చు.. ప్రీడయాబెటిస్ లక్షణాలు: ప్రీడయాబెటిస్ లక్షణాలు తరచుగా చాలా తక్కువగా ఉంటాయి.. ప్రజలు సాధారణంగా వాటిని విస్మరిస్తారు. కానీ అలసట, తరచుగా దాహం, ఆకలి పెరగడం, బరువులో అవాంఛనీయ మార్పులు వంటి చిన్న చిన్న సమస్యలపై శ్రద్ధ పెట్టాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువసార్లు మూత్రవిసర్జన చేయడం, తరచుగా పుండ్లు కావడం, చూపు స్పష్టంగా లేకపోవడం, గాయాలు, దెబ్బలు త్వరగా మానకపోవడం కూడా ప్రీడయాబెటిస్ సంకేతాలే.. ఈ లక్షణాలు కనిపిస్తే, వెంటనే రక్తంలో చక్కెరను తనిఖీ చేయాలి. సమయానుకూలంగా పరీక్షలు చేయించుకోవడం - జీవనశైలిలో మార్పులు తప్పనిసరి.. ఇంకా, మంచి ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యనిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వారి కుటుంబంలో మధుమేహం ఉన్నా.. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు రక్తంలో చక్కెరను క్రమం తప్పకుండా పరీక్షించడం అవసరం. రెగ్యులర్ పరీక్షల ద్వారా, ప్రీడయాబెటిస్‌ను గుర్తించడం మాత్రమే కాకుండా దానిని సకాలంలో నియంత్రించవచ్చు. ప్రిడయాబెటిస్ రిస్క్ నుంచి ఇలా బయటపడండి: ఆరోగ్యకరమైన ఆహారం, పండ్లు, కూరగాయలు, గింజలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె అధికంగా ఉండే ఆహారం ప్రిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మరింత చురుకుగా ఉండటం, బరువు తగ్గడం, ధూమపానం మానేయడం, అవసరమైన మేరకు మందులు తీసుకోవడం ద్వారా ప్రిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు..

## మీకెప్పుడైనా తీవ్ర భయం, ఆందోళనగా అనిపిస్తే.. వెంటనే ఇలా చేయండి! 2 నిమిషాల్లో నార్మల్ అవుతారు



మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా, మానసికంగా ప్రశాంతత లేకపోతే జీవన గందరగోళంగా ఉంటుంది. సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే దీర్ఘకాలిక రుగ్మతలకు దారి తీస్తుంది. తద్వారా విపరీత ఆలోచనలతో ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుంది. మితిమీరిన ఆందోళన, పని ఒత్తిడి, కుటుంబ సమస్యల గురించి అతిగా ఆలోచించడం మిమ్మల్ని మానసికంగా, శారీరకంగా అనారోగ్యానికి గురి చేస్తుంది. ఇది ఆందోళన వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది. ఇది ఒక రకమైన మానసిక రుగ్మత. ఇది నిద్రను కూడా ప్రభావితం చేస్తుంది. కండరాల ఒత్తిడిని పెంచుతుంది. జీర్ణ సమస్యలు, చిరాకు, ఏకాగ్రత లేకపోవడం, తీవ్ర భయాందోళనలకు గురవుతుంటారు. దేశంలో దాదాపు 88% మంది ప్రజలు ఏదో ఒక రకమైన ఆందోళనతో బాధపడుతున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. అంటే ప్రతి 100 మందిలో 88 మంది ఈ మానసిక రుగ్మతకు గురవుతున్నారన్నమాట. కాబట్టి మీ చుట్టుపక్కల ఎవరైనా పానిక్ అటాక్‌తో బాధపడుతున్నట్లయితే, ఇలా చేయండని మానసిక వైద్యులు సలహా ఇస్తున్నారు. మీరూ పానిక్ అటాక్‌తో బాధపడుతుంటే ఎలా సహాయం చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.. నీళ్లు తాగడం వల్ల వారిలో కొంత భయం, ఆందోళన తగ్గుతాయి. చల్లటి నీరు తాగడం వల్ల పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఇది వ్యక్తిని శాంతింపజేయడానికి సహాయపడుతుంది. తీవ్ర భయాందోళనకు గురైతే వెంటనే చేతులు, కాళ్ళను చల్లటి నీటితో కడగాలి. అలాగే టవల్‌ను తడిపి మీ ముఖం లేదా మెడపై ఉంచుకోవాలి. ఇది భయం నుండి కొంచెం శాంతపరచడానికి సహాయపడుతుంది. మీ చుట్టుపక్కల లేదా ఇంట్లో ఎవరైనా భయాందోళనకు గురవుతున్నట్లు అనిపిస్తే.. మీరు వారి ప్రవర్తనను చూస్తే దూరంగా ఉండకండి.బదులుగాఆవ్యక్తిని సౌకర్యవంతమైన కుర్చీ లేదా సోఫాలో కూర్చోబెట్టి.. కాసేపు మీరు వారితో గడపడానికి ప్రయత్నించాలి.

## సాక్స్ లేకుండా షూస్ వేసుకుంటున్నారా? నష్టాలు ఏంటో తెలుసుకోండి!



సాధారణంగా చాలా మంది సాక్స్ లేకుండా షూస్ వేసుకుంటారు. ఇటీవలి కాలంలో కూడా యువతలో ఇలాంటి ఫ్యాషన్ ఎక్కువగా ఉంది. సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాల్లో దుర్వాసన రావడమే కాకుండా ఆరోగ్యం కూడా పాడవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో చెమట ఎక్కువగా ఉండే భాగాలలో పాదాలు ఒకటి. అలాగే రోజంతా షూస్ వేసుకోవడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. అందుకే దీనిని వదిలించుకోవడానికి, వాసనను నివారించడానికి, పాదాలను పొడిగా ఉంచడానికి సాక్స్ ఉత్తమం. వీటన్నింటితో పాటు, ఇది తరచుగా పాదాలకు చెమట పట్టడాన్ని నివారిస్తుంది. అందుకే సాక్స్ లేకుండా బూట్లు ధరించడం వల్ల కలిగే నష్టాలు ఏమిటి? సాక్స్ మన పాదాలను ఎలా ఆరోగ్యంగా ఉంచుతుంది? దానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకుందాం. వేసవికి మాత్రమే కాకుండా శీతాకాలానికి కూడా మంచిది: సాక్స్ ధరించడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది అనేక రకాల బ్యాక్టీరియా నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అలాగే వీటిని ధరించడం వల్ల ఎలాంటి ఫంగల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు దరిచేరవు. సాక్స్ వేసవిలో చెమట పట్టకుండా నిరోధించడమే కాకుండా శీతాకాలానికి కూడా మేలు చేస్తుంది. ఎందుకంటే ఆ సమయంలో సాక్స్ వేసుకోవడం వల్ల జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఇవి మీ పాదాలను వెచ్చగా ఉంచుతాయి. అలర్జీ సమస్య: సాక్స్ ధరించకుండా షూస్ వేసుకునే వారికి అలర్జీ సమస్య రావచ్చు. కొంతమందికి చాలా సున్నితమైన చర్మం ఉంటుంది. అందుకే అబ్బాయిలు, సాక్స్ లేకుండా బూట్లు ధరించవద్దు. లేకపోతే చాలా మందికి పాదాలకు చెమట పట్టడం, వారి పాదాలకు అనేక రకాల సమస్యలు వస్తాయి. చెమట బూట్ల లోపల తేమను మరింత పెంచుతుంది. ఇది వివిధ రకాల బ్యాక్టీరియా లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. కొందరికి సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాలకు పొక్కులు వస్తాయి. ఇలాంటి సమస్య రాకుండా ఉండాలంటే బూట్లు వేసుకునే వారు సాక్స్ ధరించాలని నిపుణులు చెబుతున్నారు.

## పెసర పిండితో ఇలా చేస్తే ముఖంపై జిడ్డు, మృతకణాలు మాయం..! అదిరి పోయే అందం మీ సొంతం..



మన వంటింట్లో లభించే సహజ సిద్ధమైన పదార్థాలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడమే, చర్మం ఎంతో ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఇందులో పెసలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడంలో చక్కగా పని చేస్తుందని చెబుతున్నారు. చర్మానికి ఇది చేసే మేలు అంతా ఇంతా కాదు. చర్మాన్ని మృదువుగా చేయడంలోనూ, చర్మానికి మెరుపును ఇవ్వడంలోనూ, చక్కటి రంగు తేలేలా చేయడం లోనూ పెసర్లు చక్కగా పని చేస్తాయి. ఇందుకోసం కొద్దిగా పెసరపప్పు తీసుకుని బాగా ఎండబెట్టి పొడిలా చేసుకుని నిలువ చేసుకోవాలి. దీనిని ఫేస్ ప్యాక్ లాగా వేసుకోవాలి అనుకున్నప్పుడల్లా ఆ పెసరపిండిని వినియోగించుకోవచ్చు. రెండు టీ స్పూన్ల పెసరపప్పు పొడిని తీసుకొని అందులో కాస్త పసుపు వేసుకోవాలి. అందులో కావాల్సినంతా మోతాదులో పచ్చిపాలను కలుపుకుంటూ మెత్తటి పేస్ట్ లా తయారు చేసుకోవాలి. ఇపుడు ఆ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌లా ముఖానికి అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత పదిహేను ఇరవై నిమిషాలకు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి... ఇలా వారానికి రెండు మూడు సార్లు చేయడం వలన చక్కటి ఫలితాలను పొందగలరు. మూడు టీ స్పూన్ల పెసరపిండి, ఒక టీ స్పూను బియ్యప్పిండి, కొద్దిగా పసుపు వేసి దానికి రోజ్ వాటర్ కలిపి మెత్తని పేస్ట్ లా చేసుకోవాలి. తర్వాత ఆ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసుకుంటూ బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వలన చర్మ రంధ్రాలోని మురికి, బ్యాక్టీరియా పోయి చర్మం కాంతి వంతంగా కనిపిస్తుంది. చర్మం బరకగా కనిపిస్తుంటే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు కప్పు పెసర పిండిలో చెంచా నిమ్మరసం, చెంచా ఆలివ్ నూనె కలిపి ఆ మిశ్రమాన్ని ఒంటికి పట్టించి నలుగులా రుద్దుకోవాలి. ఇలా రోజూ చేస్తుంటే మృతకణాలు తొలగి చర్మం నునుపుగా మారుతుంది.

# స్పోర్ట్స్

# తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ పెద్ద దిక్కు



టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గిన తొలి జట్టు ముంబై ఇండియన్స్ ). తొలి ఐదేళ్లలో ఒక్క టైటిల్ కూడా నెగ్గని ముంబై.. 2013లో తొలిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 2015, 2017, 2019, 2020లలో మరో నాలుగు టైటిల్స్ నెగ్గింది. ఈ ఐదు టైటిల్స్ కూడా రోహిత్ శర్మ కెప్టెన్సీలోనే రావడం విశేషం. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ సమీపిస్తున్న తరుణంలో జట్ల బలాబలాలు, ఆటగాళ్ల ప్రదర్శనపై విశ్లేషణలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ముంబై ఇండియన్స్ జట్టు గురించి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముంబై జట్టులో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి దిగ్గజ బ్యాటర్లు ఉన్నప్పటికీ, రాబోయే సీజన్‌లో ఆ జట్టుకు అత్యుత్తమ బ్యాటర్‌గా మరో ప్లేయర్‌ను ఎంపిక చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో ఐపీఎల్ 2026 అంచనాల గురించి మాట్లాడుతూ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముంబై ఇండియన్స్ జట్టులో ఎంతోమంది మ్యాచ్ విన్నర్లు ఉన్నారని, కానీ తిలక్ వర్మ ఒక 'కంప్లీట్ ప్యాకేజీ' అని ఆయన కొనియాడారు. "చాలామంది రోహిత్ శర్మ విధ్వంసం గురించి లేదా సూర్యకుమార్ యాదవ్ 360 డిగ్రీల ఆట గురించి మాట్లాడుకుంటారు. కానీ నా దృష్టిలో ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక పరుగులు చేసే ఆటగాడిగా, అత్యంత ప్రభావవంతమైన బ్యాటర్‌గా తిలక్ వర్మ నిలుస్తాడు" అని అశ్విన్ పేర్కొన్నారు. తిలక్ వర్మ గత కొన్ని సీజన్ల నుండి ముంబై ఇండియన్స్ జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ జట్టును ఆదుకోవడంలో తిలక్ చూపించే పరిణతి అద్భుతమని అశ్విన్ విశ్లేషించారు. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టులో మిడిల్ ఆర్డర్‌కు తిలక్ వర్మ వెన్నెముకగా మారాడని, అతడి బ్యాటింగ్ శైలి జట్టుకు అవసరమైన సమతుల్యతను ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన ఆటగాళ్లు అనడంలో సందేహం లేదని, అయితే తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను నిర్మించే తీరు, అవసరమైనప్పుడు గేర్ మార్చి భారీ షాట్లు ఆడే సామర్థ్యం అతడిని ప్రత్యేకంగా నిలబెడతాయని అశ్విన్ వివరించారు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తిలక్ వర్మకు ఉన్న పట్టు, మైదానం నలుమూలలా బంతిని తరలించే టెక్నిక్ అతడికి అదనపు బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. 2022లో ముంబై ఇండియన్స్ జట్టులోకి ప్రవేశించినప్పటి నుండి తిలక్ వర్మ వెనక్కి తిరిగి చూడలేదు. వరుసగా ప్రతి సీజన్‌లోనూ 300కు పైగా పరుగులు చేస్తూ తన విలువను చాటుకున్నాడు. ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగానే భారత జాతీయ జట్టులో కూడా చోటు సంపాదించుకున్నాడు. అశ్విన్ చేసిన ఈ వ్యాఖ్యలు తిలక్ వర్మపై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచుతున్నాయి. "తిలక్ కేవలం ఒక సీజన్ ప్లేయర్ కాదు, అతను భారత క్రికెట్ భవిష్యత్తు. ముంబై ఇండియన్స్ అతడిని తమ కోర్ గ్రూప్‌లో ఉంచుకోవడం ఆ జట్టు చేసిన అత్యుత్తమ నిర్ణయం. 2026 సీజన్ తిలక్ వర్మ కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుంది" అని అశ్విన్ ధీమా వ్యక్తం చేశారు. ఐపీఎల్ 2026 వేలంలో ముంబై ఇండియన్స్ తమ కీలక ఆటగాళ్లను నిలుపుకున్నప్పటికీ, అశ్విన్ అంచనా వేసినట్లుగా తిలక్ వర్మ నిజంగానే రోహిత్, సూర్యలను మించి రాణిస్తాడా అనేది వేచి చూడాలి. ఏదేమైనా, ఒక అనుభవజ్ఞుడైన ఆటగాడి నుండి ఇటువంటి ప్రశంసలు దక్కడం తిలక్ వర్మ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందనడంలో సందేహం లేదు.

## పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు గాయం?

### ముంబై ఇండియన్స్‌లో టెన్షన్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ మార్చి 28న ప్రారంభం కానుంది. ఐపీఎల్ ప్రారంభానికి కొన్ని రోజులు మాత్రమే ఉంది. సరిగ్గా ఈ సమయంలో ముంబై ఇండియన్స్‌ను టెన్షన్ పెట్టే ఒక వార్త వచ్చింది. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ఇంకా క్లారిటీ లేదు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలోని ముంబై తన మొదటి మ్యాచ్‌ను మార్చి 29న వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో ఆడనుంది. జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన బౌలర్లలో ఒకడు. తన బౌలింగ్, యార్కర్లతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చగలడు. అతడి బౌలింగ్‌లో దిగ్గజ బ్యాటర్లు కూడా మానసిక ఒత్తిడికి లోనవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో అతడు నిజంగానే గాయపడ్డాడా, అందుకే ముంబై క్యాంపులోకి ఇంకా చేరలేదని ప్రచారం జరుగుతోంది. 2021 నుండి ఒక్కసారి కూడా ఫైనల్‌కు చేరుకోని ముంబై ఇండియన్స్‌కు బుమ్రా గాయం, ఫిట్‌నెస్ చాలా ముఖ్యమైన అంశం. ఐపీఎల్ 2026 కోసం ముంబై ఇండియన్స్ ఇప్పటికే ప్రాక్టీస్ మొదలుపెట్టింది. అయితే నివేదికల ప్రకారం, జస్ప్రీత్ బుమ్రా ప్రస్తుతం కర్ణాటకలోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో ఉన్నాడు. అందిన సమాచారం ప్రకారం, బుమ్రా ఇంకా ట్రైనింగ్ క్యాంప్‌లో చేరలేదు. అయితే బుమ్రా ఏదైనా గాయంతో బాధపడుతున్నారా లేదా కేవలం రొటీన్ చెకప్ కోసం అక్కడ ఉన్నాడా అనేదానిపై స్పష్టత లేదు. 2024 నుంచి హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. 2024లో జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికే పరిమితమైంది. గతేడాది జట్టు ప్లేఆఫ్స్ వరకు చేరుకుంది కానీ, ఫైనల్‌కు కూడా చేరలేదు. ముంబై ఇండియన్స్ తన ఆరో టైటిల్ కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తోంది. ఆ 5 ఐపీఎల్ టైటిల్స్ రోహిత్ శర్మ కెప్టెన్సీలో ముంబై సాధించింది. జస్ప్రీత్ బుమ్రా 2013 నుండి ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. బుమ్రా ఐపీఎల్ లో 145 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండుసార్లు 5 వికెట్ల ప్రదర్శన చేశాడు.



# వారి జ్ఞాపకార్థం సీట్లు రిజర్వ్

గత ఏడాది ఐపీఎల్ టైటిల్ గెలిచిన సంబరాల్లో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారికి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన నివాళి అర్పించనున్నాయి. ఆ విషాద ఘటనలో మరణించిన వారి జ్ఞాపకార్థం స్టేడియం లోపలి ప్రధాన ద్వారం వద్ద ఒక ప్రత్యేక స్మారక ఫలకాన్ని ఏర్పాటు చేశాయి. దానికి తోడుగా ప్రాణాలు కోల్పోయిన ఆ 11 మందికి గుర్తుగా స్టేడియంలో 11 సీట్లను శాశ్వతంగా రిజర్వ్ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సమాచారం. న్యూస్18 ఇంగ్లీష్ కథనం ప్రకారం.. భవిష్యత్తులో జరిగే ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌లకు సైతం ఆ సీట్లను టికెట్ల రూపంలో విక్రయించరు. మృతుల పట్ల అత్యున్నత గౌరవసూచకంగా ఆ ప్రదేశాన్ని పూర్తిగా ప్రత్యేకంగా ఉంచుతారు. ఆటను ప్రాణంగా ప్రేమించే అభిమానుల కోసం ఫ్రాంచైజీ, క్రికెట్ బోర్డు కలిసి ఇలాంటి ఒక భావోద్వేగ నిర్ణయం తీసుకోవడం క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమ తొలి కప్పును ముద్దాడిన ఆనందంలో ఉన్న ఆర్సీబీ జట్టుకు, అభిమానులకు ఆ నాటి సంఘటన తీరని శోకాన్ని మిగిల్చిందని క్రీడా పండితులు విశ్లేషిస్తున్నారు. స్మారక ఫలకం ఏర్పాటు చేసిన విషయాన్ని కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ప్రసాద్ అధికారికంగా ధృవీకరించారు. అయితే సీట్ల రిజర్వేషన్ అంశంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. ఆ విషాద ఘటనను తలుచుకుంటేనే ఇప్పటికీ ఎంతో బాధగా ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా మేనేజింగ్ కమిటీ, ఇతర భాగస్వాములతో కలిసి ఆ 11 మంది మృతుల జ్ఞాపకాలను గౌరవించాలని చర్చించినట్లు తెలిపారు. పాత గాయాలను రేపడం తమ ఉద్దేశం కాదని, క్రికెట్ కోసం ప్రాణాలు వదిలిన ఆ అమాయక అభిమానులను ఎప్పటికీ గుర్తుంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ స్మారక ఫలకాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ తమ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు చిన్నస్వామి స్టేడియంలో మృతుల జ్ఞాపకార్థం ఒక నిమిషం పాటు మౌనం పాటించనున్నారు. అదే సమయంలో మైదానంలోని భారీ స్క్రీన్లపై ఆ 11 మంది పేర్లను ప్రదర్శిస్తారు. మరోవైపు గత ఏడాది జరిగిన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా పరంగా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం స్టేడియంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఒక మాక్ డ్రిల్ నిర్వహించారు. గురువారం నాడు సుమారు 500 మంది వాలంటీర్లతో మ్యాచ్ రోజు వాతావరణాన్ని తలపించేలా మరో భారీ మాక్ డ్రిల్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల కర్ణాటక ప్రభుత్వం నియమించిన ప్రత్యేక నిపుణుల కమిటీ చిన్నస్వామి స్టేడియంలో భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించింది. అన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారించిన తర్వాతే ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే సీజన్‌లో ఆర్సీబీ తమ సొంత గడ్డపై మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా, అందులో ఐదు మ్యాచ్‌లకు చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యం ఇస్తుంది. మిగిలిన రెండు మ్యాచ్‌లను రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ స్టేడియంలో ఆడుతారు. అదనపు సమాచారాన్ని పరిశీలిస్తే.. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆర్సీబీ తొలిసారిగా ఐపీఎల్ కప్పు గెలవడంతో ఉద్వేగానికి లోనైన లక్షలాది మంది అభిమానులు ఒక్కసారిగా స్టేడియం వైపు దూసుకురావడమే ఆనాటి తొక్కిసలాటకు ప్రధాన కారణం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా క్రౌడ్ మేనేజ్‌మెంట్, బారికేడింగ్ వ్యవస్థను ప్రభుత్వం మరింత పటిష్టం చేసింది.






## శ్రేయస్ అయ్యర్ టీమిండియా తదుపరి టీ20 కెప్టెన్

### మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయం

ఐపీఎల్ 2026 సీజన్‌లో కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ మెరుగైన ప్రదర్శన కనబరిస్తే టీమిండియా తదుపరి టీ20 సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2028లో టీమిండియాను నడిపించే అవకాశాన్ని కూడా అయ్యర్ అందుకోవచ్చని జోస్యం చెప్పాడు. 2028 ఒలింపిక్స్ వరకే సూర్యకుమార్ యాదవ్ టీమిండియా టీ20 కెప్టెన్‌గా కొనసాగుతాడని, ఆ ఈవెంట్ తర్వాత టీమిండియా మేనేజ్‌మెంట్ కొత్త కెప్టెన్‌ను అన్వేషించే అవకాశం ఉందన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో జియో హాట్‌స్టార్ షోలో మాట్లాడిన ఆకాష్ చోప్రా.. అయ్యర్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీ కెరీర్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో మొదలైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌ను ప్లే ఆఫ్స్ చేర్చిన అయ్యర్.. కేకేఆర్‌కు టైటిల్ అందించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. ఐపీఎల్ 2021 సమయంలో అయ్యర్ గాయపడగా..రిషభ్ పంత్‌ను ఢిల్లీ కెప్టెన్‌ను చేసింది. కెప్టెన్సీపై ఉన్న ఆసక్తితో ఢిల్లీని వీడిన అయ్యర్.. ఇతర జట్లలో తన సత్తాను నిరూపించుకున్నాడు. 2024లో కేకేఆర్‌కు టైటిల్ అందించినా.. గంభీర్ కారణంగా అతనికి రావాల్సిన గుర్తింపు రాలేదు. విరాట్ కోహ్లీ, ధోనీ, రోహిత్ శర్మల స్థాయిలో భారత్ తరఫున రాణించకపోవడంతో అయ్యర్‌కు అంతగా గుర్తింపు దక్కలేదు. ఒకవేళ శ్రేయస్ అయ్యర్ మరో ట్రోఫీ గెలిస్తే.. అన్నీ ఒక్కసారిగా మారిపోయి అందరూ అతనికి చప్పట్లు కొడతారని నేను చెప్పడం లేదు. ప్రశంసలు వచ్చినా.. అతని వ్యక్తిత్వం మాత్రం రాత్రికి రాతే మారదు. తదుపరి టీ20 ప్రపంచకప్ 2028లో జరగనుంది. భారత టీ20 సారథ్యం ఇప్పుడే మారకపోవచ్చు. కానీ ఒక రెండేళ్లలో ఆ దిశగా అడుగులు పడవచ్చు. అయ్యర్ టీమిండియా టీ20 కెప్టెన్‌గా ఎదగాలంటే మెరుగైన ప్రదర్శన చేయాలి. కెప్టెన్‌గా.. బ్యాటర్‌గా సత్తా చాటాలి. తన జట్టుకు టైటిల్ అందిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. అతను భారత్ తరఫున ప్రపంచ కప్ గెలిచిన కెప్టెన్‌గా కూడా మారవచ్చు. ఆ విలువ ప్రత్యేకమైనది. అప్పుడు అతనికి ఎటువంటి బయటి మద్దతు అవసరం లేదు.' అని ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్.. మార్చి 31న గుజరాత్ టైటాన్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది.

## రూ. 15 వేల కోట్లకు అమ్ముడైన రాజస్థాన్ రాయల్స్!

రాజస్థాన్ రాయల్స్ అమ్మకం ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం 1.63 బిలియన్ డాలర్లకు జట్టును కొనుగోలు చేసింది. ఈ క్రమంలో 1 బిలియన్ డాలర్లకు అమ్ముడైన తొలి ఐపీఎల్ జట్టుగా ఆర్ఆర్ నిలిచింది. కల్ సోమాని కన్సార్టియానికి వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే ఎంఎఫ్ఎల్ జట్టు డెట్రాయిట్ లయన్స్‌లో మెజారిటీ వాటాలు కలిగిన హాంప్ కుటుంబం నుంచి ఆర్థిక మద్దతు లభించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత ఖరీదైన డీల్. ఈ డీల్‌తో రాజస్థాన్ రాయల్స్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీగా నిలవనుంది. ఐపీఎల్ 2026 ముగిసిన తరువాత కొత్త యాజమాన్యం బాధ్యతలను స్వీకరించనుంది. గతంలో సంజీవ్ గోయెంకాకు చెందిన ఆర్‌పిఎస్‌జి గ్రూప్ లక్నో సూపర్ జెయింట్స్‌ను 940 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా.. టొరెంట్ గ్రూప్ గుజరాత్ టైటాన్స్‌లో 67 శాతం వాటాను 575 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త అయిన సోమాని ఇప్పటివరకు రాజస్థాన్ రాయల్స్‌లో మైనారిటీ వాటాను కలిగి ఉన్నారు. ఆయన 2021లోనే రాజస్థాన్ రాయల్స్‌లో కొంత పెట్టుబడులు పెట్టారు. ఇక తాజాగా ఇప్పుడు మొత్తం 100 శాతాన్ని దక్కించుకున్నారు. అరిజోనాకు చెందిన సోమానీ.. డేటా ప్రైవసీ, ఎడ్‌టెక్, క్రీడా సాంకేతికత తదితర రంగాల్లో 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఎంట్రప్రెన్యూర్. ఆయన ఇంట్రొఎడ్జ్, ట్రూయో, ఏఐ, అకాడెమియన్ వంటి సంస్థలకు ఫౌండర్. అంతేకాకుండా మోటార్ సిటీ గోల్ఫ్ క్లబ్‌కు సహ-యజమాని, టిఎమ్‌ఆర్‌డబ్ల్యూ స్పోర్ట్స్, టిజిఎల్ గోల్ఫ్ లీగ్‌లలో తొలి పెట్టుబడిదారులలో ఒకరు.




# ఆటగాళ్లకు రికీ పాంటింగ్ దిశానిర్దేశం



ఐపీఎల్ 2026 వేట మొదలైంది. గత సీజన్‌లో తృటిలో చేజారిన టైటిల్‌ను ఈసారి ఎలాగైనా ముద్దాడాలని పంజాబ్ కింగ్స్కంకణం కట్టుకుంది. ఈ క్రమంలోనే జట్టు కొత్త హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ రంగంలోకి దిగారు. చండీగఢ్ వేదికగా జరుగుతున్న ప్రాక్టీస్ క్యాంప్‌లో చేరిన పాంటింగ్, అడుగు పెట్టడమే ఆలస్యం ఆటగాళ్లకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. నెట్స్‌లో కేవలం బంతులు విసరడం, బ్యాట్ ఊపడం మాత్రమే సరిపోదని, మానసికంగా, శారీరకగా యుద్ధానికి సిద్ధం కావాలని కుండబద్దలు కొట్టారు. మార్చి 31న న్యూ చండీగఢ్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో పంజాబ్ కింగ్స్ తన తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఈ నేపథ్యంలో రికీ పాంటింగ్ ఆటగాళ్లకు దిశానిర్దేశం చేశారు. "కేవలం నెట్స్‌లో సమయం గడపడం వల్ల ఎలాంటి ప్రయోజనం అనేది ఉండదు. టెక్నికల్ గా, ఫిజికల్ గా, అంతకంటే ముఖ్యంగా మెంటల్ గా మ్యాచ్‌కి సిద్ధంగా ఉండాలి" అని ఆయన తేల్చి చెప్పారు. ట్రైనింగ్ సెషన్లు అంటే కేవలం అలవాటు కోసం చేసేవి కాదని, మనల్ని మనం ఒక విజేతగా మలచుకునే సమయం అని గుర్తు చేశారు. జట్టులో ఐక్యత ఉంటేనే అద్భుతాలు జరుగుతాయని గతేడాది ప్రదర్శనను ఉదాహరణగా చూపారు. క్రికెట్‌లో తప్పులు చేయడం సహజమని, కానీ పక్కా ప్రణాళికతో ఆడటం ముఖ్యమని పాంటింగ్ ప్లేయర్లకు హితబోధ చేశారు. ఎవరైనా క్యాచ్ వదిలేయవచ్చు లేదా బౌలర్ వైడ్ బాల్ వేయవచ్చు, అంత మాత్రాన కంగారు పడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఒక ఆటగాడు తన గేమ్ ప్లాన్ మీద నమ్మకంతో ఉండి, సరైన ఆలోచనతో ఆడుతున్నప్పుడు పొరపాట్లు జరిగితే అది పెద్ద సమస్య కాదని ఆయన అభిప్రాయపడ్డారు. టోర్నమెంట్ ఫలితాల మీద ఒత్తిడి పెంచుకోకుండా, ప్రతి రోజూ అనుసరించే పద్ధతి మీద దృష్టి పెడితే సక్సెస్ ఆటోమేటిక్ గా వస్తుందని పాంటింగ్ భరోసా ఇచ్చారు. గత ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఫైనల్ వరకు దూసుకెళ్లింది. కానీ, నిర్ణయాత్మక పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) చేతిలో కేవలం 6 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో ఆర్సీబీ తన తొలి ఐపీఎల్ టైటిల్ గెలుచుకోగా, పంజాబ్ కింగ్స్ నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. ఆ చేదు జ్ఞాపకాలను చెరిపివేసి, ఈసారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా పంజాబ్ అడుగులు వేస్తోంది. అందుకే ఈసారి జట్టు కూర్పులో కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈసారి పంజాబ్ కింగ్స్ టీమ్ చాలా బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో జట్టులో టాలెంటెడ్ ఆటగాళ్లు ఉన్నారు. బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ ధాటిగా బంతులు వేయడానికి సిద్ధంగా ఉండగా.. మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్ లాంటి ఆల్‌రౌండర్లు జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నారు. లోకీ ఫెర్గూసన్ వేగం, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, నెహాల్ వధేరాల మెరుపులు జట్టుకు అదనపు బలం. ఇవన్నీ చూస్తుంటే ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ ఒక బలమైన టైటిల్ ఫేవరెట్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# షుగర్ పేషెంట్స్ ఎంత సేపు నడవాలి





### - ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!!

మధుమేహం. ఒక్క సారి వచ్చిందంటే జీవితాంతం జాగ్రత్తగా ఉండాల్సిందే. ప్రస్తుత కాలంలో మధు మేహ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరగటానికి అనేక కారణాలు ఉన్నాయి. సక్రమమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు పాటిస్తే డయాబెటిస్ ముప్పు తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు. అందు లో భాగంగా ముఖ్యంగా రోజూ వాకింగ్ చేస్తే డయాబెటిస్?తో బాధపడుతున్న వారికి ఎంతో మేలు జరుగుతుందని స్పష్టం చేస్తున్నారు. అయితే, మధుమేహం ఉన్న వారు ఎంత సేపు నడవాలి .. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దాని పైన నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. రక్తంలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచటం లో నడక సహకరిస్తుంది. డయాబెటిస్ బాధితులు రోజుకు కనీసం 30 నిమిషాలు నడిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వారంలో 5 రోజులు, రోజుకి 30 నిమిషాలు వాకింగ్ చేస్తే మేలని పరిశోధనలు వెల్లడించాయి. అదే విధంగా క్రమం తప్ పకుండా ఏరోబిక్ వ్యాయామం చేయడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయని అధ్యయనం లో తేలింది. శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి పెరిగితే రక్తంలో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. యోగా, ధ్యానం, వ్యాయామం లాంటివి చేయాలని సూచిస్తున్నారు. ఎవరికైనా శారీరక శ్రమ అవసరమని, అందుకోసం క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలని చెబుతున్నారు. ఫలితంగా రక్తంలో షుగర్ స్థాయిలు అదుపులో వస్తాయని వివరిస్తున్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ .. లంచ్.. డిన్నర్ తరువాత కనీసం పది నిమిషాలు నడిస్తే రక్తంలో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయని వెల్లడిస్తున్నారు. వాకింగ్ చేసేటప్పుడు గంటకు మూడు నుంచి నాలుగు మైళ్ల మితమైన వేగంతో నడిస్తే ఇన్సులిన్ స్థాయిలు పెరగడంతోపాటు గుండె సంబంధిత సమస్యలు అదుపులో ఉంటాయి. అయితే, వాకింగ్ వేళ పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జాయింట్లపై ఒత్తిడి పడకుండా ఉండాలంటే సమాంతరంగా ఉన్న నేలపై నడక కొనసాగించాలని చెబుతున్నారు. ఆ తర్వాత మెట్లు ఎక్కడం, దిగడం చేయాలని తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు ఉదయం లేదా సాయం త్రం వేళల్లో వాకింగ్?కు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి. వాకింగ్ చేయడం వల్ల రక్త ప్రసరణ పెరిగి చర్మానికి ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా అందుతాయని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ముఖంలో నీరసం పోయి సహజ కాంతితో ఉండేలా చేస్తుందని వెల్లడిస్తున్నారు.



## బ్రేక్‌ఫాస్ట్‌ను బ్రేక్ చేస్తున్నారా?

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తున్నారా? అయితే, మీ మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్నదట. 'అల్పాహారం–మానసిక ఆరోగ్యం'పై చేసిన ఓ సర్వే.. ఈ విషయాలను వెల్లడిస్తున్నది. 'హాంకాంగ్ యూత్ ఎపిడెమియోలాజికల్ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్' పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం 15 నుంచి 24 ఏళ్ల వయసుగల 3,154 మందిని ఎంపిక చేశారు. వీరి రోజూవారి ఆహార అలవాట్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం ఏదో ఒకటి తిన్నవారితో పోలిస్తే.. అల్పాహారం దాటవేసినవారు ఎక్కువ ఉద్రేకంతో, ఆందోళనతో, నిరాశతో కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది ప్రతిరోజూ లేదా అడపాదడపా ఏదో ఒక అల్పాహారం తీసుకున్నారు. మిగిలిన 15% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా దాటవేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకోని వారిలో శ్రద్ధ తగ్గిపోవడం, స్వీయ నియంత్రణను కోల్పోవడం లాంటి సమస్యలను గుర్తించినట్లు అధ్యయనకారులు చెబుతున్నారు. ఇక అల్పాహారం దాటవేసేవారు తక్కువ ఉత్పాదకత కలిగి ఉన్నారని, పేలవమైన పనితీరును కనబర్చినట్లు గుర్తించారు. ఉద్యోగాలలోనూ తక్కువ సామర్థ్యం కలిగి ఉన్నారని నివేదించారు. బ్రేక్‌ఫాస్ట్‌ను దాటవేయడం వల్ల మధ్యాహ్నం వరకే నిస్సత్తువ ఆవహిస్తుందనీ, దాంతో దేనిమీదా శ్రద్ధ పుట్టదని చెబుతున్నారు. అందుకే, ఏ రకమైన ఆహారం, ఎంత పరిమాణంలో తింటారనే విషయాలతో సంబంధం లేకుండా.. ఉదయంపూట ఏదో ఒకటి తినడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక అల్పాహారం వల్ల మానసిక ఆరోగ్య ప్రయోజనాలతోపాటు శారీరక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత.. మధ్యాహ్నంపూట తక్కువ కేలరీలు తీసుకుంటారు. దాంతో బరువు అదుపులో ఉంటుంది. రక్తంలోనూ చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.

## ఇల్లంటే ఓ ఎమోషన్!



కొందరికి ఇల్లు అంటే స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. రిచ్‌గా కనిపించాలని అనుకుంటారు. నటి అదితి రావ్ హైదరీ మాత్రం ఇల్లంటే నాలుగు గోడల నిర్మాణం కాదనీ, ఓ ఎమోషన్ అని చెబుతున్నది. అభిరుచికి తగ్గట్టు, చిన్ననాటి జ్ఞాపకాలతో తన నివాసాన్ని ఓ అందమైన గూడుగా మార్చుకుందామె! 'నేను పనిచేసేది పొగడ్తల ప్రపంచంలో.. కానీ, నాకు నిజమైన కాంప్లిమెంట్ ఏంటో తెలుసా? ఎవరైనా నా ఇంటికి వచ్చినప్పుడు వాళ్లు చాలా కంఫర్ట్ ఫీల్ అవ్వాలి. వాళ్ల ఇల్లే అన్నట్టుగా భావించాలి! అదే నాకు ఎక్కువ సంతృప్తినిస్తుంది' అని చెప్పుకొచ్చింది అదితి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన ఇంటి గురించి చెబుతూ.. 'మీరు నమ్మరు!! చిన్నప్పుడు నాన్న నాకు ఒక అద్భుతమైన బొమ్మల ఇల్లు తయారు చేసిచ్చారు. అందులోనే బెడ్‌రూమ్‌లు, మంచాలు, చిన్న చిన్న మనుషుల బొమ్మలు, ఇంటి చుట్టూ లైట్లు, మెలికలు తిరిగిన మెట్లు ఇలా భలేగా ఉండేది. నేను ఈ ఇంటికి వచ్చినప్పుడు.. నా బొమ్మల ఇల్లే అనిపించింది' అని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంది. 'నాకు వెంటిలేషన్ అంటే చాలా ఇష్టం. హాల్‌లో కిటికీ పక్కన కూర్చుని, అలా ఎక్కడికో చూస్తూ ఆలోచనల్లో ఉండిపోతాను. మా ఇల్లు కాస్త చిన్నదే! కానీ, చాలా సౌకర్యంగా ఉంటుంది. ముంబయి లాంటి నగరంలో చిన్న ఓపెన్ స్పేస్ ఉండటం ప్రత్యేకమే! మనం కోరుకున్న ఇంట్లో ఉన్నప్పుడు.. అనుకున్న డెస్టినీకి చేరుకున్న ఫీలింగ్ కలుగుతుంది. మనల్ని మనమే కొత్తగా కనుక్కున్నట్టు అనిపిస్తుంది. నావరకైతే ఇల్లంటే ఓ నిర్మాణం కాదు.. భావోద్వేగం' అని ఇంటితో ఉన్న బంధాన్ని పంచుకుంది అదితి.

# స్టీల్ డబ్బాల్లో వద్దు..



ప్లాస్టిక్ డబ్బాల వినియోగం ఆరోగ్యానికి హానికరం. అందుకే, ఆహార పదార్థాల నిల్వకోసం స్టీల్ పాత్రలనే ఎక్కువగా వాడుతున్నారు. కానీ, కొన్ని పదార్థాలు స్టీల్‌తో రసాయన చర్య జరుపుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని స్టీల్ పాత్రల్లో స్టోర్ చేయొద్దని సూచిస్తున్నారు. టమాటాల్లోని సహజ ఆమ్లాలు.. ఉక్కుతో చర్య జరుపుతాయి. దాంతో, ఆహార పదార్థాల రుచితోపాటు పోషకాలు కూడా దెబ్బతింటాయి. కాబట్టి, టమాటా వంటకాలను స్టీల్ డబ్బాల్లో నిల్వ చేయకపోవడమే మంచిది. సిరామిక్ బౌల్, గాజు కంటెయినర్లు వాడుకోవచ్చు. అసిడిక్ లక్షణాలు ఉండే పచ్చళ్లను కూడా స్టీల్ డబ్బాలకు దూరంగా ఉంచాలి. మామిడి, నిమ్మ, ఉసిరి, చింతపండులో ఉండే ఆమ్ల లక్షణాలు.. దీర్ఘకాలంలో స్టీల్‌తో రసాయన చర్య జరుపుతాయి. ఫలితంగా పచ్చళ్ల రుచి మారడంతోపాటు ఓ రకమైన మెటాలిక్ టేస్ట్ కూడా వస్తుంది. పచ్చళ్లు కూడా త్వరగా పాడవుతాయి. అందుకే, పచ్చళ్లకు స్టీల్ డబ్బాల కన్నా.. గాజు పాత్రలు, సిరామిక్ జాడీలే మంచివి. ఇక కట్ చేసిన పండ్లు, ఫ్రూట్ సలాడ్ వంటివి కూడా.. స్టీల్ గిన్నెల్లో పెట్టడం మంచిది కాదట. వాటిని ఎక్కువ సమయంపాటు స్టీల్ కంటెయినర్లలో ఉంచితే.. నీటిశాతం పెరుగుతుంది. రుచి కూడా దెబ్బతింటుంది. బదులుగా.. గాజు పాత్రల్లో ఉంచితే ఫ్రెష్‌గా ఉంటాయి. సిట్రస్ జాతికి, స్టీల్‌కు పడనే పడదు. అందుకే, నిమ్మపండ్లతో చేసే లెమన్ రైస్, లెమన్ జ్యూస్ కూడా స్టీల్ డబ్బాల్లో స్టోర్ చేయొద్దు. మామిడికాయలు, చింతపండుతో తయారైన పదార్థాలను స్టీల్ డబ్బాలో నిల్వ చేసినా.. వాటి రుచి తగ్గుతుంది. ఇక పెరుగులోనూ సహజసిద్ధమైన ఆమ్ల లక్షణాలు ఉంటాయి. కాబట్టి, పెరుగును స్టీల్ డబ్బాల్లో ఎక్కువ సమయంపాటు పెడితే.. దాని రుచితోపాటు టెక్చర్ కూడా మారుతుంది. పెరుగును సిరామిక్, గాజు పాత్రల్లో నిల్వ చేయడమే ఉత్తమం.

# మార్కెట్

## సౌత్ ఇండియాలో ఆషాఢం సేల్స్

### ఆర్ఎస్ బ్రదర్స్‌లో ఆఫర్లే ఆఫర్లు

హైదరాబాద్ : కొనుగోలుదారులను ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ఆర్ఎస్ బ్రదర్స్ ముందుంటుంది. ఆషాఢ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన 'సూపర్ ఆషాఢం కేజీ సేల్' క్యాప్షన్‌తో ప్రకటించిన ప్రత్యేక ఆఫర్లకు కస్టమర్ల నుంచి భారీ స్పందన లభిస్తున్నది. అన్ని రకాల వస్త్రాలపై 70 శాతం వరకు తగ్గింపు ధరతో అందిస్తున్నది. సంస్థ అందిస్తున్న పలు ఆఫర్లు రూ.3,695 ధర కలిగిన అలంకారీ ప్రింట్ చీరను కొనుగోలు చేసిన వారికి రెండో చీరను రూ.39కే అందిస్తున్నది. అన్ని రకాల లేడీస్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్‌పై ఆకర్షణీయమైన ధరకే విక్రయిస్తున్నది. 22 క్యారెట్ కలిగిన బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రతీగ్రాముకి రూ.200 తగ్గింపునిస్తున్నది. పాత బంగారం ఎక్స్ఛేంజ్‌పై గ్రామునకు రూ.100 అదనంగా పొందవచ్చును. కేజీ వెండి వస్తువులపై రూ.5 వేల తగ్గింపునిస్తున్నది.




# టీసీఎస్‌లో భయం.. భయం..

### కొత్త పాలసీతో ఎంప్లాయీస్‌లో గుబులు
### ముగిసిన 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్
### లేఆఫ్‌లు, డిమోషన్లపై పెరుగుతున్న ఆందోళన
### కేంద్రం జోక్యానికి ఉద్యోగ సంఘాల లేఖ



ఆడుతూ పాడుతూ పని, ఆకర్షణీయ వేతనాలు, విలాసవంతమైన జీవితం. ఇదీ.. ఐటీ రంగంలో కొలువుల తీరు. అయితే నిన్నమొన్నటిదాకా ఇలా ఉండచ్చేమోగానీ.. ఇప్పుడు మాత్రం సీన్ రివర్సైంది. కొరవడిన ఉద్యోగ భద్రత, జీతాల్లో కోతలు, ఒత్తిడితో కూడిన జీవనం. ఇదీ.. ఐటీ రంగ ఉద్యోగుల ప్రస్తుత పరిస్థితి. సాంకేతిక మార్పులు, పెరుగుతున్న పోటీ, పడిపోతున్న ఆదాయం ఇలా.. ఎన్నెన్నో అంశాలు ఐటీ కంపెనీలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే టీసీఎస్ ఓ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇప్పుడిది అటు ఉద్యోగుల్లో, ఇటు పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. న్యూఢిల్లీ దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తెచ్చిన కొత్త పాలసీ ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. గత నెల జూన్ 12న అమల్లోకి వచ్చిన ఈ విధానంలో 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్ తాజాగా ముగిసింది. దీంతో సంస్థ ఉద్యోగులకు గుబులు పట్టుకుంటున్నది. వేలాది ఉద్యోగులు తమ భవిష్యత్తుపై అనిశ్చితిని చూడాల్సి వస్తున్నది మరి. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అన్ని విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ పాలసీ వర్తిస్తుండటం గమనార్హం. ఏమిటీ కొత్త పాలసీ? ఏ ప్రాజెక్టులో భాగస్వామి కాకుండా ఏడాదిలో గరిష్ఠంగా 35 రోజుల కంటే ఎక్కువ రోజులు సంస్థలో పనిచేసే ఏ ఉద్యోగీ ఉండరాదు. అలా ఉన్నైట్లైతే వారి ఉద్యోగం రిస్క్‌లో పడ్డట్టే. ఫ్రెషర్లైతే ఉద్యోగాల్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అలాగే పైస్థాయి ఉద్యోగులైతే కిందిస్థాయికి దిగజారే వీలున్నది. సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు దక్కకపోవచ్చు. వేతనాలు, ఇతర అలవెన్సుల్లో కోతలుపడే అవకాశాలూ లేకపోలేదు. ఇక ఏడాది కాలవ్యవధిలో ప్రతీ ఉద్యోగి నేరుగా క్లైయింట్ లేదా ప్రాజెక్టుతో కనీసం 225 రోజులు తప్పక పనిచేయాల్సి ఉంటుంది. మిగతా సమయాన్ని ఇంటర్నల్ టాస్క్‌లు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఏఐ–క్లౌడ్ టెక్నాలజీ వంటి కొత్త సాంకేతికతల్ని అందిపుచ్చుకోవడం, ఇతర కార్యకలాపాల కోసం వెచ్చించవచ్చు. ఉద్యోగులేమంటున్నారు? కొత్త పాలసీతో తాము విపరీతమైన ఒత్తిడిలోకి వెళ్లిపోతున్నామని టీసీఎస్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'వినియోగం ఆధారంగా ఉద్యోగుల్ని హేతుబద్ధీకరించడం ఇదే తొలిసారి. ఉద్యోగాల తొలగింపునకే ఇది దారితీయగలదు' అని సోషల్ మీడియా వేదిక రెడిట్‌లో ఓ టీసీఎస్ ఉద్యోగి పేర్కొన్నారు. అలాగే 'టీసీఎస్‌లో నేను ఇటీవలే చేరాను. జావాలో శిక్షణ పొందుతున్నాను. కానీ నెల రోజులు కూడా కాకముందే అందుకు భిన్నం గా సపోర్టింగ్ ప్రాజెక్టులో చేరాలన్న ఒత్తిళ్లు వస్తున్నాయి' అని మరో ఉద్యోగి చెప్తున్నారు.



## వేగంగా ఆర్ఎంయూ పనులు

### 2026 మార్చిలో రైల్వే బోగీల యూనిట్ ప్రారంభం

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే మల్టీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే మార్చి నాటికి ప్రారంభించాలనుకుంటున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. జీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయన కాజీపేటకు వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా రైల్వే సర్క్యులేటింగ్ ఏరియా, అమృత్ భారత్ పథకం పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న ఈ యూనిట్‌ను సందర్శించి సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. షెడ్డులో నిర్మాణ పనులను పరిశీలించి, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతాయని, వెంటనే ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 160 ఎకరాల స్థలంలో రూ.716 కోట్లతో నిర్మిస్తున్న ఈ యూనిట్‌లో తొలి ఏడాది 600 బోగీలు, ఆ తర్వాత ఏడాదిలో 2,400 బోగీలు తయారుకానున్నాయి.

# ఆంధ్రప్రదేశ్

## ఏపిలో ఉగ్రలింకుల కలకలం

### విజయవాడలో ముగ్గురు యువకుల అరెస్ట్

విజయవాడ : ఏపీలో ఉగ్రలింకులు కలకలం రేపాయి. ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానంతో విజయవాడలో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల యువకులతో పాటు, భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసి రహస్యంగా విచారిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిరంతర నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సోషల్‌మీడియా కార్యకలాపాలపైనా దృష్టిసారించారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ పోలీసులు.. వారి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, విదేశాల్లో ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ముగ్గురు యువకులు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరిని రహస్యప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఉగ్రవాదం వైపు ఎవరు ప్రేరేపిస్తున్నారు? వీరికి సోషల్‌మీడియా లింకులు ఎలా వస్తున్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ టెర్రర్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్ర కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు హైదరాబాద్‌కు చెందిన మహిళతో సంబంధాలు ఉన్నట్లుగా సమాచారం. ఆ మహిళే కీలక సూత్రధారి అని పోలీసులు భావిస్తున్నారు. విజయవాడలో ముగ్గురు అనుమానితుల్ని అరెస్టు చేసిన వెంటనే.. ఆమె పరారవ్వడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

## పిజి వైద్యసీట్ల కౌన్సిలింగ్ పొడిగింపు అసాధ్యం

### తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ,మార్చి24 : తెలుగు రాష్ట్రాల్లోని పీజీ వైద్య విద్యార్థులకు, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం ఎదురుచూస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పు పెద్ద షాక్‌గా మారింది. పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిపోయిన పీజీ వైద్య సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ గడువును పొడిగించాలని దాఖలైన పిటిషన్లను జస్టిస్ పీఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. నేషనల్ మెడికల్ కమిషన్ వాదనలతో ఏకీభవిస్తూ కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏడు రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహించామని, ఇంతకంటే ఎక్కువ రౌండ్లు నిర్వహించడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. కౌన్సెలింగ్ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తే విద్యా క్యాలెండర్ దెబ్బతింటుందని, ఇది వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం కొన్ని సీట్లు మిగిలిపోవడం సహజమేనని, ముఖ్యంగా ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అధిక ఫీజుల కారణంగా సీట్లు మిగిలిపోతాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఎన్ఎంసీ తన నివేదికను సమర్పిస్తూ కౌన్సెలింగ్ పొడిగింపును తీవ్రంగా వ్యతిరేకించింది. మిగిలిపోయిన సీట్లలో అత్యధికం ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు చెందినవేనని, ప్రభుత్వ సీట్లు దాదాపు భర్తీ అయ్యాయని వివరించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం, నిర్దేశిరచిన తేదీ దాటిన తర్వాత అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో సీటు వస్తుందని ఆశపడిన వందలాది మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరానికి అవకాశం కోల్పోయారు.

### విజయవాడ హైవేలో ఎలివేటెడ్ కారిడార్

#### అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,మార్చి24 : రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధికా ప్రాధాన్యం ఇస్తోందని ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో.. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై నారాయణరెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లై ఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు

### ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

న్యూఢిల్లీ,మార్చి24 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరంతో పాటు పశ్చిమాసియాలో పరిస్థితిపై ఉభయులూ చర్చించారు' అని సెర్గియో గోర్ ఆ ప్రకటనలో తెలిపారు. రాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేశారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో జరుపుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే అమెరికాతో చర్చలను ఇరాన్ కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోనులో సంభాషించినట్టు ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన చర్చ జరిగిందన్నారు. వీలైనంత త్వరలో ఉద్రికతలు తొలగేందుకు, శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు ఉంటుందని తాను స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి తెరవడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులోకి తేవడం యావత్ ప్రపంచానికి అవసరమని పేర్కొన్నారు.

## పునర్విభజనతో మరిన్ని అవకాశాలు



పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమై పలు ముఖ్య అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై సమగ్రంగా చర్చించి నేతలకు పవన్ దిశానిర్దేశం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంలో ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా, వాస్తవిక దృక్పథంతో ప్రజాప్రతినిధులు ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. 2009లో చివరిసారిగా పునర్విభజన జరిగినప్పుడు రాష్ట్రం, దేశంలో చోటు చేసుకున్న అంశాలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవా లన్నారు. నిబంధనలకు అనుగుణంగా, ప్రజాప్రయోజనమే పరమార్థంగా, సహేతుకంగా పునర్విభజన జరిగేలా జనసేన ప్రజా ప్రతినిధులు ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా జనసేన ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలకు చేరువలో (రీచ్ అవుట్) ఉంటూ... నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో మంగళవారం విజయవాడలో సమావేశమయ్యారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నియోజక వర్గాల పునర్విభజన నిర్ణయం వల్ల రాష్ట్రంలో అసెంబ్లీతోపాటు పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. ఇప్పుడున్న నియోజకవర్గాలను 50 శాతం పెంచాలన్న కేంద్రం నిర్ణయం హర్షణీయం. కేంద్రం నిర్ణయంతో 88 అసెంబ్లీ సీట్లు, 12 వరకు పార్లమెంట్ సీట్లు కొత్తగా పెరుగుతాయి. అంటే కొత్తగా 100 మంది ప్రతినిధులను చట్ట సభలకు పంపించే అవకాశం వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకొని డీలిమిటేషన్ ఎక్కడా దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత మనపై ఉంది. డీలిమిటేషన్ పై జనసేన ఏ విధంగా ముందుకు వెళ్లాలి? ఎటువంటి కార్యాచరణ అవలంబించాలి? అనే అంశాలపై సూచనలు చేయడానికి శాసనసభ్యులతో కూడిన కమిటీ నియమించాలని పార్టీ పీఏసీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారికి సూచిస్తున్నాను. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా డీలిమిటేషన్ పై పార్టీ కార్యాచరణ నిర్దేశిరచుకుందాం. కొద్ది నెలల్లో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు రానున్నాయి. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పని చేయాలి. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. ఏ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా కష్టపడాలి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అభిలషణీయమైన సంఖ్యలో గెలుపొందడం మన శ్రేణుల పోరాట పటిమకు నిదర్శనం. వచ్చే స్థానిక పోరులో గెలుపే లక్ష్యంగా సిద్ధంగా ఉండాలి. పార్టీ బలంగా ఉంటేనే ప్రజా ప్రతినిధులు బలంగా ఉంటారు. దానిని దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి ప్రజా ప్రతినిధులు ముందుండి పని చేయాలి. ఉద్యమి సభ్యత్వం ఎంత అధికంగా ఉంటే పార్టీ అంత బలంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు వివిధ వర్గాలు ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలను ఏ విధంగా కలిసి ఓట్లను అభ్యర్థించామో... అదే విధంగా, అదే రీతిలో ఇప్పుడు కూడా నిరంతరం వారిని కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకోవాలి. కొన్ని అసాధ్యమైన కోరికలు వ్యక్తమైనప్పటికీ సాధ్యాసాధ్యాలను వారి ముందు ఉంచితే వారి మనసులు గెలుచుకోవడం కష్టం కాదు. వారంలో ఏదో ఒక రోజు నియోజకవర్గంలో ఒక ప్రాంతంలో ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేపట్టాలి. వాటి పరిష్కారానికి కృషి చేయాలి. దీని కోసం పక్కాగా ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలి. నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో దృష్టి పెట్టాలి. వ్యవసాయం, ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలపై దృష్టి సారించి అన్ని వర్గాల ప్రజలకు దగ్గరవ్వాలి. కులాలు లేకుండా సమాజం నడవదు. ప్రతి కులాన్ని గౌరవిస్తూ ముందుకు వెళ్లాలి. ప్రతి శాసనసభ్యుడు రాజకీయ వాస్తవికతకు దగ్గరగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి. ÷ాష్ట్రంలో 8-12 శాతం వరకు యువత ఉన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన మావన వనరులుగా వారిని తీర్చిదిద్దాలి. జెన్ జి ఆలోచనలు అర్థం చేసుకోవాలి. వారిని చేరువ అవ్వడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలి. రాజకీయ కార్యకలాపాలకు కుటుంబ సభ్యులను ఎంత పరిమితి మేరకు అనుమతించాలో ప్రజాప్రతినిధులు ఎవరికి వారు లోతుగా ఆలోచన జరిపి నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయం ప్రజలు హర్షించేలా ఉండాలి. వ్యక్తులు చేసిన పనులు వ్యక్తులకే పరిమితం అవ్వాలి. అంతే తప్ప వాటి ఆధారంగా పార్టీపై ప్రభావం పడకూడదు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా నిధులు సమకూర్చాము. వాటి సద్వినియోగంపై అందరూ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అవి క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరువ కావాలి. జల్ జీవన్ మిషన్ 2 .0 కి ఈ రోజు ఎం.ఓ.యూ. చేసుకున్నాము. జల్ జీవన్ నిధులతో ప్రతి ఇంటికీ తాగు నీరు ఇచ్చే లక్ష్యంతో పని చేస్తున్నాము. ప్రతి నియోజకవర్గానికి పీఆర్ ఆర్డీ శాఖలు, ఆర్. డబ్ల్యు.ఎస్. ద్వారా నిధులు అందుతున్నాయి. వాటి ద్వారా చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత మీపైనే ఉంది' అన్నారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'సంఖ్యాపరంగా అసెంబ్లీలో జనసేన పార్టీ రెండో స్థానంలో ఉండటం మనందరికీ గర్వ కారణం. స్థానిక సంస్థల ఎన్నికలకు స్థానికంగానే వ్యూహరచన చేసుకోవాలి. డీలిమిటేషన్ లో చేర్పులు, మార్పులు, విభజన ప్రక్రియలు జిల్లా యంత్రాంగం చేతుల్లో కేంద్రీకృతమై ఉంటాయి. గతంలో జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియ ఆధారంగా ఈ మాటలు చెబుతున్నాను. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి చోట గెలిచి నూటికి నూరు శాతం ఫలితాలు రాబట్టుకోవాలి అని కోరారు. లెజిస్లేటివ్ పార్టీ సమావేశం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. 3 గంటల సేపు కొనసాగిన ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రారంభోపన్యాసం చేశారు. ఆ తరువాత గ్రూపులుగా, విడివిడిగా అందరి సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ సమావేశంలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చిన క్రమంలో ముఖ్యమైన అంశాల మీద అధ్యయనానికి పార్టీకి, సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రజాప్రతినిధులతో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీకి సూచించారు. చర్చించిన అంశాలు ప్రజలు, పార్టీకి ఉపయోగపడేలా మలుచుకోవాలని సూచించారు. ప్రతి నెల 3 లేదా 4వ వారంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అందరితో సమావేశమవుతానని చెప్పారు. వచ్చే నెల తొలి వారంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఈ సమావేశంలో రాజకీయంగా పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి చర్చిస్తామని చెప్పారు.

## అనంతపురం వాసులకు ఊరట

### ఆర్డీటీకి కేంద్ర హోంశాఖ అనుమతి

అనంతపురం,మార్చి24 : అనంతపురం జిల్లా వాసులకు కేంద్రం శుభవార్త చెప్పింది. విదేశీ నిధులు పొందేందుకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కు కేంద్ర హోంశాఖ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులకు సమాచారం ఇచ్చింది. ఆర్డీటీ సంస్థ అనంతపురం జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. దీనికి విదేశాలనుంచి వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన అనుమతులను ఎఫ్‌సీఆర్ఏ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) కింద నిలిపివేస్తూ ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆ సంస్థ ఎఫ్‌సీ (ఫారిన్ కాంట్రిబ్యూషన్) ఖాతాల్లో ఉన్న నిధులను వినియోగించడానికి ఆటంకం ఏర్పడింది. ఫలితంగా ఈ సంస్థ చేపడుతున్న విద్య, వైద్యం, స్వయం ఉపాధి కార్యక్రమాల అమలుకు అంతరాయం కలిగింది. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎంపీలు దీన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ క్రమంలో ఎఫ్‌సీఆర్ఏను కేంద్రం రెన్యువల్ చేసింది. పేదల కోసం దశాబ్దాలుగా అద్భుత సేవలు అందిస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధుల అంశంలో ఉన్న సమస్య పరిష్కరించిన ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాకు ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. తెలుగు రాష్టాల్లోని వేలాది గ్రామాల్లో వివిధ రకాల సేవలను ఆర్డీటీ అందిస్తోందని చెప్పారు. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ కింద స్వచ్ఛంద సంస్థలకు విదేశాల నుంచి వస్తున్న నిధులను నిలిపివేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయంతో సంస్థ సేవలకు అంతరాయం కలిగిందన్నారు. సంస్థ అందిస్తున్న సేవలను వివరించి, ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర హోం మంత్రికి విజ్ఞప్తి చేయగా.. ఆయన చూపిన ప్రత్యేక చొరవతో నేడు అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి.. ఈ ట్రస్ట్ ద్వారా లబ్ది పొందుతున్న లక్షలాది మంది పేద ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సీఎం పేర్కొన్నారు. ఆర్డీటీ నిర్వాహకులు మాంచో ఫెర్రర్‌కు ఆయన అభినందనలు చెప్పారు.

## బిల్లుల చెల్లింపును హైకోర్టులో తేల్చుకోండి

### పెద్దిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ,మార్చి24 : వైసీపీ నేత పెద్దిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో తన కంపెనీకి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరుతూ ఆయన సతీమణి పేరిట దాఖలు చేసిన పిటిషన్‌ను, ఏపీ హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.గత ప్రభుత్వ కాలంలో పి.ఎల్.ఆర్ కంపెనీ ద్వారా చేపట్టిన రోడ్డు పనులకు సంబంధించి బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బిల్లులను వెంటనే చెల్లించేలా ఆదేశించాలని సుప్రీంకోర్టును పెద్దిరెడ్డి ఆశ్రయించారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు నేరుగా జోక్యం చేసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం, ఈ అంశంపై ముందుగా ఆంధప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. దీనిపై పెద్దిరెడ్డి తరఫు న్యాయవాదులు ఇప్పటికే ఏపీ హైకోర్టులో 12 కేసులు దాఖలు చేసినట్లు సుప్రీంకోర్టుకు వివరించారు. అయినప్పటికీ, హైకోర్టు పరిధిలోనే ఈ అంశం పరిష్కారం కావాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు సూచనల మేరకు పెద్దిరెడ్డి తరఫు న్యాయవాదులు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ కేసు ప్రస్తుతం హైకోర్టులోనే కొనసాగనుంది.

## సిఎం చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ

### అమరావతిలో ఫిలిం సిటీ వ్యవహారాలపై చర్చ

అమరావతి,మార్చి24 : అమరావతిలో త్వరలోనే ఏపీలో భారీ సినీ స్టూడియోలు లేదా అంతర్జాతీయ స్థాయి ఫిలిం సిటీ నిర్మాణంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపిస్తోంది. మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సంజయ్ దత్ బృందం నేరుగా వెలగపూడిలోని సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. గత ఫిబ్రవరిలో ముంబై వేదికగా మంత్రి నారా లోకేశ్‌తో జరిగిన చర్చల కొనసాగింపుగానే ఈ పర్యటన సాగుతున్నట్లు తెలుస్తోంది. సంజయ్ దత్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన ముగ్గురు కీలక ప్రముఖులు ఈ భేటీలో పాల్గొన్నారు. గౌరవ్ దూబే , కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వీరిలో ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఒక భారీ ఫిలిం సిటీ లేదా సినిమా హబ్ అవసరం ఎంతైనా ఉంది. గతంలో లోకేశ్‌తో జరిగిన భేటీలో సంజయ్ దత్ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఈ ఫిలిం సిటీని అమరావతి పరిసరాల్లో లేదా విశాఖపట్నంలో ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. సినిమా షూటింగ్‌ల కోసం ఏపీని ఒక గమ్యస్థానంగా మార్చడానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, మౌలిక సదుపాయాలపై సీఎం చంద్రబాబు సంజయ్ దత్ బృందానికి వివరించినట్లు తెలుస్తోంది. ఏపీలో సినిమా ఇండస్ట్రీకి అవసరమైన లొకేషన్లు పుష్కలంగా ఉన్నాయి. సంజయ్ దత్ వంటి అగ్ర నటులు ఇక్కడ స్టూడియోలు లేదా ఫిలిం సిటీలను నిర్మిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. బాలీవుడ్, సౌత్ సినిమాల కలయికతో ఏపీ సినీ హబ్‌గా మారుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



## కొనసాగనున్న ఆర్డీటి సేవలు


### కేంద్రం అనుమతితో యధావిధిగా కార్యక్రమాలు

అమరావతి : తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ కార్యకలాపాలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఆర్డీటీ సేవలు ఆగిపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఆర్డీటీకి అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. దీంతో సంస్థకు ఎదురైన పరిపాలనా అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్డీటీ డైరెక్టర్ మంచో ఫెర్రర్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా దశాబ్దాలుగా తెలుగు రాష్టాల్లో అందుతున్న సేవలు వెలకట్టలేనివి.అనంతపురం జిల్లాతో పాటు యావత్ రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈఅఖీం పునరుద్ధరణ లభించడం ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది. అనంతపురం జిల్లా సామాజిక, ఆర్థిక చిత్రపటాన్ని మార్చేసిన ఆర్డీటీ సంస్థకు ఉన్న అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. విదేశీ నిధుల సేకరణకు అవసరమైన ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సును కేంద్ర ప్రభుత్వం మార్చి 22, 2031 వరకు పొడిగిస్తూ అధికారికంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రాయలసీమతో పాటూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆర్డీటీ ఎంత అవసరమో వివరించారు. నిలిచిపోతాయనుకున్న అనేక సంక్షేమ పథకాలు ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో కొనసాగనున్నాయి. ఈ లైసెన్స్ పునరుద్ధరణ వెనుక ఆంధప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కృషి అనితరసాధ్యమైనది. ఆంధప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా ఢిల్లీకి వెళ్లి, కేంద్ర హోం శాఖాధికారులు, మంత్రులతో భేటీ అయ్యారు. ఆర్డీటీ దశాబ్దాలుగా చేస్తున్న నిరుపమాన సేవలను వారికి వివరించి, సాంకేతిక ఇబ్బందులను తొలగించేలా ఒప్పించారు.

## అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు

### కుట్రకోణంపై దర్యాప్తు: హోంమంత్రి


అమరావతి,మార్చి24(ఆర్ఎన్ఎ):రాజధాని అమరావతిపై ఎవరు కుట్రలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అమరావతిలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం.. అది కూడా ఒకే తరహాలో జరుగుతుండటంపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతిలోని రాయపూడి సమీపంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల బంగ్లాల వద్ద గత అర్థరాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదాన్ని.. ఐదు అగ్నిమాపక శకటాలతో చాలా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అమరావతిలో ఇటీవల జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించారన్నారు. ఆ రోజు సైతం జరిగిన అగ్నిప్రమాదం కూడా ఉద్దేశపూర్వకంగా జరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ తరహా ఘటనలు జరగటానికి అవకాశాలు చాలా స్వల్పమని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు.




# శ్రీలీల ట్రాక్ చూసేందుకు మహిళల ఆసక్తి

ఉస్తాద్ భగస్ సింగ్‌పై హరీష్ శంకర్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. తాజాగా దీని ప్రచారంలో భాగంగా హరీశ్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాకు వస్తున్న స్పందనపై ఆయన మాట్లాడుతూ.. సెకండ్ హాఫ్‌లో వచ్చే శ్రీలీల ఎపిసోడ్ మహిళా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. 'నిజం చెప్పాలంటే.. రెండో భాగంలో శ్రీలీల ట్రాక్ చూడటం కోసమే మహిళలు భారీగా థియేటర్లకు వస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను రెండు గంటల పాటు అభిమానులు వారు కోరుకున్నవిధంగా చూసుకోదగ్గ చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి ఆస్వాదించేలా ఉంది. నేను ఈ చిత్రం విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను' అని అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీలో పవన్‌కు జోడీగా శ్రీలీల, రాశీఖన్నా నటించగా.. పార్తీబన్ విలన్ పాత్రలో కనిపించారు.






# పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది సౌండ్ గట్టిగా ఉంటుందని నమ్ముతున్నారు మెగాభిమానులు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తన పేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధించిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఎ÷–లాట్‌ఫారమ్‌లు, అనామక వ్యక్తులు తన 'మోహన్ లాల్' అనే బ్రాండ్‌ను అక్రమంగా వాడుకోకుండా వెంటనే స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్వినియోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అనుకూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మలతో టీ-షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడించడం లేదా ఆయన గొంతుతో ంఎ వీడియోలు సృష్టించడం వంటివి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'దృశ్యం 3' సినిమా కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.





## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై
# భారీ అంచనాలు

### సోషల్ మీడియాలో లయన్ పోస్టర్‌పై ఆసక్తి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్ట్రాటజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.




# దురంధర్-2 కు రజనీకాంత్ ప్రశంసలు

తాజా బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనాన్ని చూసి.. ఆదిత్య ధర్ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిత్యను 'బాక్సాఫీస్ కా బాప్' అని ప్రశంసించడమే కాకుండా సినిమా అద్భుతంగా ఉందని రజనీకాంత్ కొనియాడారు. ఈ సందర్భంగా హీరో రణవీర్ సింగ్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని అన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తలైవా పోస్ట్‌కు ఆదిత్య ధర్ ఎమోషనల్ రిప్లై పెట్టారు. 'మేమందరం వినోదం అనే పదానికి మీ ఒక్కరినే బెంచ్‌మార్క్‌గా చూస్తూ పెరిగాము. దశాబ్దాలుగా మమ్మల్ని విజిల్స్ వేయించేలా, నవ్వించేలా, భావోద్వేగానికి గురయ్యేలా.. మీరు వినోదానికి అసలైన అర్థం చెప్పారు. ఇప్పటికీ అదే స్టైల్.. అదే గ్రేస్‌తో మీరు చేస్తున్న మ్యాజిక్ అద్భుతం. అలాంటిది మీరు 'ధురందర్ 2'ను తప్పక చూడాల్సిన చిత్రం అని చెప్పడం నా జీవితంలో అతిపెద్ద 'సూపర్‌స్టార్' మూమెంట్‌గా అనిపిస్తోంది. పెద్ద కలలు కనేలా మమ్మల్ని ప్రోత్సహించిన వ్యక్తి నుంచి అందిన ఈ ప్రశంస ఒక వరంలా ఉంది. మీ మాటలకు నా హృదయం ఉప్పొంగుతోంది' అని దర్శకుడు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఇప్పటికే రూ.750 కోట్ల మార్కును దాటి రికార్డులు తిరగరాస్తోంది. రజనీకాంత్‌తో పాటు అల్లు అర్జున్, మహేశ్ బాబు, నాగార్జున వంటి ఇతర అగ్ర తారలు కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com